




ఓడినా.. గెలవొచ్చు!



కలల సాకారం కోసం పరుగులు తీసే ప్రతి క్షణం జీవితంలో ఓ ప్రయత్నం మాత్రమే. ఉత్తీర్ణులు కాకపోయినా.. మార్కులు తక్కువ వచ్చినా కుంగిపోవాల్సిన పనిలేదు.. తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరమూ లేదు.. ఒక్కసారి మన ముందు తరాన్ని తలచుకోవాలి.. వాళ్లు ఎక్కడ గెలిచారు.. ఓడినా ఒక్కో మెట్టు ఎలా ఎక్కారో అవగాహన చేసుకోవాలి.. ఒత్తిడిని ఒడిసి పట్టుకొని లక్ష్యాన్ని చేరడానికి పరిశ్రమించాలి. ఒక పరీక్ష తప్పితేనో.. ఓ ప్రయత్నం విఫలమైతేనో జీవితం ఆగిపోయినట్టు కాదు! ప్రయత్నించాలి.. ఒక్కో మెట్టు ఎక్కాలి.. అంతే కానీ.. ఓ పరీక్ష తప్పితే.. ఎన్నో ఆశలు పెట్టుకొన్న పెద్దోళ్లను బతికున్నంత కాలం నరకం అనుభవించేలా చేయడం తగదు.. తల్లిదండ్రులకు జీవితాంతం శోకాన్ని మిగల్చడం సరికాదు.. ఇంటర్మీడియట్ అంటే ఎదుగుతున్న వయసు. ఇలాంటప్పుడే ఆటుపోట్లను తట్టుకొనే సామర్థ్యాన్ని కూడగట్టుకోవాలి. అయినా.. ఉందిగా మే నెల.. మార్పిపైన! వాయిదా పద్ధతుంది దేనికైనా! శనివారం ఇంటర్మీయట్ వార్షిక పరీక్షల ఫలితాలు వెలువడనున్నాయి. ఈ సందర్భంగా అందరికీ ఆంధ్రజ్యోతి విజయోస్తు!.

6

కనుల నిండుగా.. స్వామిని చూడగా!

వాడపల్లి వెంకన్న తెప్పోత్సవం శుక్రవారం కన్నుల పండువగా సాగింది. పుష్కరణిలో తెప్పపై స్వామి అమ్మవార్లు భక్తులకు ప్రత్యేక దర్శనమిచ్చారు.. ఆపద మొక్కులవాడా వాడపల్లి వెంకన్నా అంటూ భక్తజనం కీర్తించారు.. స్వామిని కన్నులారా చూసి తరించారు. ఆ దృశ్యాలివి..



6

బిల్లుకు దారేది!



- బిల్లు.. చెల్లింపు నిల్
- ఉమ్మడి జిల్లాలో రూ.400 కోట్లు
- భారీగా ఆర్‌అండ్‌బీ బకాయిలు
- అమలాపురం రూ.150 కోట్లు
- రాజమండ్రి డివిజన్ రూ.30 కోట్లు
- ప్రభుత్వ బాకీలు రూ.90 కోట్లే
- అత్యధిక బాకీలు వైసీపీలోనివే
- ఇటీవల రూ.290 కోట్లు చెల్లింపు
- పాత బాకీలు ఆపండి
- ప్రభుత్వం తాజా నిర్ణయం
- కాంట్రాక్టర్ల గగ్గోలు

గత పనులతో మనకేం సంబంధం

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆర్‌అండ్‌బీ రహదారుల బిల్లుల బాకీలు భారీగా పేరుకు పోయాయి. పూడ్చిన గుంతలు, ఇతర మరమ్మతులకు బిల్లులు ఆగిపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన రహదారులకు సంబంధించి గుంతలు పూడ్చాలని సీఎం చంద్రబాబు ఆదేశించడంతో సంక్రాంతి వరకు ఉమ్మడి జిల్లాలో దాదాపుగా ఈ పనులన్నీ పూర్తిచేశారు. ఉమ్మడి జిల్లాలో రహదారుల బిల్లుల బాకీలు రూ.400కోట్లకుపైగానే పేరుకుపోయాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వ హయాంలో గుంతలు పూడ్చిన పనులకు సంబంధించిన బిల్లులు రూ.90 కోట్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయి. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో ఎన్నికలు దగ్గరపడ్డ సమయంలో హడావుడిగా రహదారుల మురమ్మతులు చేపట్టారు. కానీ బిల్లులను మాత్రం జగన్ నిలిపివేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారేసమయానికి ఉమ్మడి జిల్లాలో ఆర్‌అండ్‌బీ బాకీలు రూ.600కోట్ల వరకు ఉన్నాయి. అయితే కాంట్రాక్టర్ల ఆవేదన విన్న సీఎం చంద్రబాబు పాతబాకీల్లో రూ.290 కోట్లు వరకు విడుదలయ్యేలా ఆదేశాలు జారీ చేశారు. ఇవిపోను తాజా పనులతో కలిపి మొత్తం బాకీలు రూ.400 కోట్ల వరకు ఉన్నాయి. అయితే నిధుల కొరతతో గతేడాది వరకు పేరుకుపోయిన బిల్లుల బాకీలు ఇకపై చెల్లించకూడదని సర్కారు తాజాగా నిర్ణయం తీసుకోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

అప్పుడలా వదిలేశారు...

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ఆర్‌అండ్‌బీ రోడ్లు నిర్మించిన కాంట్రాక్టర్లు గగ్గోలు పెడుతున్నారు. గత ప్రభుత్వంలో బిల్లులు రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకున్న పరిస్థితులు నెలకొనగా, ప్రభుత్వం మారడంతో కొంత ఒడ్డునపడ్డామని భావిస్తోన్న కాంట్రాక్టర్లు సర్కారు తాజా నిర్ణయంతో తలపట్టుకుంటున్నారు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఎక్కడికక్కడ రహదారులను గాలికొదిలేశారు. ప్రజలు,పార్టీలు ఆందోళనలు చేసినా అప్పట్లో జగన్ సర్కారు చెవి కెక్కించుకోలేదు. అయితే గతేడాది అసెంబ్లీ ఎన్నికలు జరగడంతో ఓట్ల కోసం అప్పటిక ప్పుడు వైసీపీ ప్రభుత్వం కొన్ని కీలక రహదా రులకు మరమ్మతులు చేపట్టింది. టెండర్లు పిలిచి పనులు చేయించింది. ఎన్నికల ఏడాది కావడంతో చేసిన పనులకు బిల్లులు వస్తాయనే ఆశతో చాలా మంది కాంట్రాక్టర్లు అప్పులు చేసి పనులు చేశారు. తీరా జగన్ ప్రభుత్వం బాకీలు చెల్లించకుండా చేతులెత్తేసింది.ఈలోపు ఎన్నికలు రావడంతో వైసీపీ ఓడిపోయింది. దీంతో కాంట్రాక్టర్ల పరిస్థితి దయనీయంగా మారింది. అప్పట్లో చేసిన పనులకు సంబంధించి రూ.600 కోట్ల వరకు బిల్లులు పేరుకుపోయాయి. ఈలోపు ప్రభుత్వం మారడంతో కాంట్రాక్టర్లు అధికారుల చుట్టూ తిరిగారు. విషయం సీఎం చంద్రబాబుకు వివరించారు. కాంట్రాక్టర్ల పరిస్థితిని అర్థం చేసుకున్న సీఎం బాకీల్లో కొంత విడుదలకు అధికారులను ఆదేశించారు. దీంతో గతేడాది చివర్లో మొత్తం రూ.600 కోట్ల బాకీలకు గాను రూ.290 కోట్లను ప్రభుత్వం చెల్లించింది. దీంతో కొంత వరకు కాంట్రాక్టర్లు ఒడ్డున పడ్డారు.ప్రభుత్వం మారిన తర్వాత రహదారుల దుస్థితిపై సమీక్షించిన సీఎం చంద్రబాబు అనేక రహదారుల పరిస్థితి దయనీయంగా ఉండడం గుర్తించారు. ఎక్కడెక్కడ ఏయే రహదారులకు మరమ్మతులు, గుంతలు పూడ్చాలో నివేదిక తయారు చేయాలని ఆదేశించారు. దీంతో జిల్లాలో గుర్తించిన రహదారుల గుంతలు పూడ్చే పనులు ఈ ఏడాది ఫిబ్రవరి వరకు చేపట్టారు. ఇందుకు రూ.150 కోట్ల వరకు ఖర్చయింది. అయితే వీటికి చెల్లింపులు చేయగా ఇంకా రూ.90 కోట్ల వరకు బాకీలు పేరుకుపోయాయి. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోవడంతో బిల్లుల చెల్లింపు కష్టంగా మారింది. ఉన్నంతవరకు ప్రభుత్వం అతికష్టంపై ఒక్కో బిల్లు చెల్లించుకువస్తున్నా ఆర్‌అండ్ బాకీలు క దలకపోవడంతో కాంట్రాక్టర్లు లబోదిబోమంటున్నారు.

అత్యధికం అక్కడే..

మొత్తం పేరుకుపోయిన రూ.400 కోట్ల బాకీల్లో కాకినాడ ఆర్‌అండ్‌బీ డివిజన్‌కు సంబంధించి రూ.40 కోట్ల వరకు బిల్లులు పేరుకు పోయాయి. పెద్దాపురం ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో రూ.35 కోట్లు, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా(అమలాపురం డివిజన్)లో రూ.150 కోట్లు, రాజమహేంద్రవరం ఆర్‌అండ్‌బీ డివిజన్ పరిధిలో రూ.30 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. అల్లూరి సీతారామరాజు జిల్లాలో రూ.20 కోట్లు, రాజానగరం-సామర్లకోట ఏడీబీ రోడ్డుకు సంబంధించి రూ.30 కోట్లు బకాయిలు ఉన్నాయి. అయితే ఇందులో సింహభాగం గత ప్రభుత్వ హయాంలోవే. మరోపక్క చంద్రబాబు సీఎం అయిన తర్వాత ఉమ్మడి జిల్లాలో అధ్వాన రహదారులపై చలించిపోయారు. యుద్ధ ప్రాతిపదికన వీటిని గుర్తించి గుంతలు పూడ్చేలా ఆదేశాలు జారీచేశారు. ఇందుకు రూ.150 కోట్లకు పైగానే ఖర్చయింది. వీటికి సంబంధించి కొంత చెల్లింపులు చేయగా ఇంకా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రూ.90 కోట్ల వరకు బిల్లులు నిలిచిపోయాయి. అమలాపురం సర్కిల్ పరిధిలో రూ.38 కోట్లు, పెద్దాపురం రూ.12 కోట్లు, రాజమహేంద్రవరం రూ.16 కోట్లు, కాకినాడ ఆర్‌అండ్‌బీ డివిజన్‌లో రూ.24 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇదిలాఉంటే సకాలంలో బిల్లులు రాకపోవడం ప్రస్తుతం కొత్తగా టెండర్లు పిలవడానికి సిద్ధంగా ఉన్న కొన్ని రహదారుల నిర్మాణంపై ప్రభావం చూపుతోంది. కొత్త పనులకు అధికారులు అంచనాలు సిద్ధం చేయగా, టెండర్లు పిలవడానికి పాలనాపరమైన ఆమోదం కూడా లభించింది. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో వీటిని పిలిస్తే కాంట్రాక్టర్లు ఆసక్తి చూపరని అధికారులు భావిస్తున్నారు. దీంతో కొత్త ప్రాజెక్టులు ముందుకు కదలడంలేదు. ఇదిలా ఉంటే కొత్తగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పలు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.64 కోట్లు నిధులు మంజూరు చేస్తూ పాలనాపరమైన ఆమోదం ఇచ్చింది. వీటికి త్వరలో టెండర్లు పిలవబోతున్నారు. అయితే గతంలో నిలిచిపోయిన బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్లు ఒత్తిడి చేస్తుండడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని అధికారులు చెబుతున్నారు. మరోపక్క గతేడాది వరకు నిలిచిపోయిన పెండింగ్ బిల్లులకు సంబంధించి సీఎఫ్ఎంఎస్‌లో లోడ్ చేసిన బిల్లులను సైతం వెనక్కు తీసుకుని చెల్లింపులు నిలిపివేయాలని తాజాగా ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో బాకీల పరిస్థితి ఏంటోనని అధికారులు, కాంట్రాక్టర్లు తలపట్టుకుంటున్నారు.



వేటకు విరామం

- 15 నుంచి సముద్ర జలాల్లో చేపల వేట నిషేధం
- సముద్ర జాతుల సంతానోత్పత్తిని సంరక్షించేందుకే..
- 61 రోజులపాటు చేపల వేటను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

అమలాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 15 నుంచి సముద్ర జలాల్లో చేపల వేటను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సముద్ర జలాల్లోని వివిధ జాతుల సంతానోత్పత్తిని సంరక్షించడమే లక్ష్యంగా ఏటా చేపల వేటను నిషేధించడం జరుగుతుంది. ఇందులో భాగంగానే ఈనెల 15 నుంచి జూన్ 14వ తేదీ వరకు 61 రోజులపాటు సముద్ర జలాల్లో చేపల వేటను నిషేధించారు. సముద్రజలాల్లో చేప, రొయ్య, పీత జాతుల సంతానోత్పత్తి కాలంలో తల్లి చేప, రొయ్య, పీతలను సంరక్షించడం, వాటి సంతతి పెరుగుదలను ప్రోత్సహించడంతో పాటు సముద్ర మత్స్య సంపద సుస్థిరతను సాధించడమే లక్ష్యంగా ఈ విరామం ప్రకటిస్తారు. ఈ సమయంలో సముద్ర జలాల్లో యాంత్రిక పడవలైన మెకనైజ్డ్, మోటరైజ్డ్ బోట్లపై మత్స్యకారులు ఎటువంటి చేపల వేట చేయకుండా మత్స్య అభివృద్ధికి సహకరించాల్సి ఉంటుంది. నిషేధిత ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చర్యలు తప్పవని జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు హెచ్చరించారు. చేపల వేట నిబంధనలను ఉల్లంఘించిన బోట్ల యజమానులకు రాష్ట్ర సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ చట్టం-1994, సెక్షన్-4ను అనుసరించి శిక్షార్హులు అవుతారన్నారు. అంతేకాకుండా బోట్లను, మత్స్య సంపదను స్వాధీనం చేసుకోవడమే కాకుండా జరిమానా విధిస్తామన్నారు. ఆయా బోట్ల యజమానులకు డీజిల్ ఆయిల్ రాయితీ, వేత నిషేధ భృతి, ప్రభుత్వం అందించే అన్నిరకాల రాయితీ సౌకర్యాలు నిలుపుదల చేస్తామన్నారు. చేపల వేట నిషేధాన్ని ఖచ్చితంగా అమలు చేసేందుకు మత్స్యశాఖ, కోస్ట్ గార్డు, కోస్టల్ సెక్యూరిటీ, పోలీసులు, రెవెన్యూ అధికారులతో తీర ప్రాంతం వెంబడి గస్తీ ఏర్పాటు చేస్తామన్నారు. మత్స్యకారులు, మత్స్యకార పెద్దలు చేపల వేట నిషేధానికి సహకరించాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు. ప్రస్తుతం సముద్రంలో చేపల వేటలో ఉన్న బోట్లన్నీ ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రిలోపు ఒడ్డుకు చేరుకుని పట్టుబడి చేసిన మత్స్య సంపదను 15వ తేదీ రాత్రిలోపు అమ్మకం జరిపి రవాణా చేసుకోవాలన్నారు. నిబంధనలను ఉల్లంఘించి ఈనెల 15 నుంచి చేపల వేటలో పట్టుబడిన అన్ని రకాల మత్స్యసంపదను స్వాధీనం చేసుకుని జరిమానా విధిస్తామన్నారు. నిషేధ కాలంలో ఏ విధమైన బోట్లు దీర్ఘకాల చేపట వేటకు వెళ్లరాదని జిల్లా మత్స్యశాఖ అధికారి చెప్పారు.

'చమురు, సహజవాయువు లీకేజీ ప్రమాదాల నివారణకు చర్యలు'

అమలాపురం టౌన్, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చమురు, సహజవాయువు లీకేజీ ప్రమాదాలు జరగకుండా ముందస్తు నివారణ ప్రణాళికలను రూపొందించాలని ఆయా కంపెనీల ప్రతినిధులకు కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. జిల్లాలో చమురు సహజవాయు నిక్షేపాలు వెలికితీసి వివిధ ప్రాంతాలకు పైపులైన్ల ద్వారా సరఫరా చేస్తున్న ఓఎన్జీసీ, గెయిల్, వేదాంత, క్లీన్ ఎనర్జీ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నచోట, పైపులైను మార్గాల్లో లీకేజీలను నివారించేందుకు, ప్రమాదాల నివారణ తదితర అంశాలపై ఆయా కంపెనీల ప్రతినిధులతో శుక్రవారం కలెక్టరేట్‌లో చర్చించారు. డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ అధికారి రామకృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా జిల్లాలో ఫ్యాక్టరీలు, వాటిలో ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న అంశాలపై అవగాహన కల్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ పైపులైన్లను రెగ్యులర్‌గా తనిఖీ చేస్తూ రెండు వారాల్లో సమగ్ర నివేదిక అందించాలని కోరారు.

సాగు ఖర్చు తగ్గించేందుకు డ్రోన్ టెక్నాలజీ

రైతుల సాగు ఖర్చును తగ్గించుకునేందుకు డ్రోన్ టెక్నాలజీ ఎంతగానో ఉపయోగపడుతుందని కలెక్టర్ మహేష్‌కుమార్ అన్నారు. ఈ నెల 7 నుంచి 11వ తేదీ వరకు డ్రోన్ ఫ్లయింగ్ ఆపరేటింగ్ సాంకేతిక శిక్షణ పొందినవారికి శుక్రవారం ధ్రువపత్రాలను కలెక్టర్ పంపిణీ చేశారు.

నేడు రిజిస్ట్రేషన్లకు అవకాశం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఆదేశాలను అనుసరించి రెండో శనివారం రోజున రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్టు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు తెలిపారు. జిల్లాలోని అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు యథావిధిగా పనిచేస్తాయన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఇంటర్మీడియట్ ఫలితాలు వెల్లడి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఈ నెల 12న విడుదల చేస్తున్నట్టు ఇంటర్మీడియట్ విద్యామండలి ప్రకటించినట్టు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు శుక్రవారం తెలిపారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన ఇంటర్మీడియట్ జనరల్, ఒకేషనల్ పరీక్షల ఫలితాలను ఆన్‌లైన్‌లో ఉదయం 11 గంటల నుంచి అందుబాటులో ఉంచుతారన్నారు. సంబంధిత రిజల్ట్ వెబ్‌సైట్‌తోపాటు మన-మిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు హాయ్ అని మెస్సేజ్ పంపి ఫలితాన్ని పొందవచ్చని తెలిపారు. గత ఏడాది జిల్లాలో ప్రథమ సంవత్సరం 60 శాతం, ద్వితీయ సంవత్సరం 72శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారన్నారు.





కలెక్టరేట్‌లో జ్యోతిబాపూలేకు నివాళులర్పిస్తున్న చైర్మన్ దినకర్, మంత్రి సుభాష్, ఎంపీ హరీష్, కలెక్టర్ మహేష్‌కుమార్... జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కృష్ణారావు

సంఘసంస్కర్తలకు మార్గదర్శి జ్యోతిబాపూలే

అమలాపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఎందరో సంఘ సంస్కర్తలకు మార్గదర్శిగా నిలిచిన మహనీయుడిగా జ్యోతిబాపూలే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని 20 సూత్రాల కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్ పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా, అట్టడుగు వర్గాల అణచివేతకు వ్యతిరేకంగా నిరంతరం పోరాడిన యోధుడు జ్యోతిబాపూలే ఎందరికో స్ఫూర్తి ప్రదాతగా నిలిచారన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో జ్యోతిబాపూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. పూలే చిత్రపటానికి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌తోపాటు రాజకీయ ప్రముఖులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎమ్మెల్సీలు బొమ్మి ఇజ్రాయిల్, కుడుపూడి సూర్యనారాయణరావు, జిల్లా బీసీ సంక్షేమాధికారి పీఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ బి.కృష్ణారావు పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్

వికసిత్‌భారత్.. స్వర్ణాంధ్ర 2047 లక్ష్య సాధనకు కృషిచేయాలి

- 2030 వరకు జలజీవన్ మిషన్ గడువు పొడిగింపు
- 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ దినకర్

అమలాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్.. స్వర్ణాంధ్ర-2047 ల్యే సాధనకు అధికారులంతా పూర్తి సమన్వయంతో పనిచేయాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో శుక్రవారం దినకర్ అధ్యక్షతన కేంద్ర ప్రాయోజిత పథకాలు, ప్రాజెక్టుల అమలు పురోగతి, మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్య సాధనకు అధికారులే రథసారథులుగా నిలవాలన్నారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల అమలులో లోటుపాట్లను గుర్తించి వాటిని కేంద్రస్థాయిలో మరోసారి చర్చించి అధిగమించేందుకు రాష్ట్రవ్యాప్తంగా ముందస్తు సమీక్షలు నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రధాని మోదీ సంకల్పమైన వికసిత్ భారత్, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు రూపమైన స్వర్ణాంధ్ర-2047 లక్ష్య సాధనలో అధికారులు పూర్తి భాగస్వాములు కావాలన్నారు. వికసిత్ కోనసీమ జిల్లా సాకారానికి అవసరమైన కార్యాచరణ, సవాళ్లను అధిగమించేందుకు అనుసరించాల్సిన ప్రణాళికలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఉపాధి హామీ కూలీలకు రోజువారీ నిర్దేశించిన రూ.300 వేతనానికి సంబంధించి గరిష్టంగా రూ.291.20 వేతనం అందించి రాష్ట్రంలోనే జిల్లా ప్రథమస్థానంలో నిలవడం అభినందనీయమన్నారు. మెటీరియల్ కాంపోనెంట్ వినియోగం పెండింగ్‌లో ఉన్న రూ.70 కోట్లు త్వరలో చెల్లించేందుకు చర్యలు చేపడతామన్నారు. రాష్ట్రంలో జలజీవన్ మిషన్ పనులు పూర్తిస్థాయిలో జరగనందున పథకం అమలు గడువును 20-30 వరకు పొడిగించామన్నారు. లఖ్‌పతి దీదీ కార్యక్రమంలో భాగంగా జిల్లాలో మిగిలిన 20వేల మందిని లక్షాధిపతులుగా తీర్చిదిద్దాలన్నారు. పీఎం విశ్వకర్మయోజన ద్వారా పనిముట్లు అం దించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీఎం ఎఫ్ఎంఈ, గరీబ్ కల్యాణ్ అన్నయోజన, పేదవారికి ఆహార భద్రత, పీఎంసూర్యఘర్, కుసుమ్ తదితర పథకాలపై సమీక్షించారు. కొబ్బరిలో కోకో అంతర పంటల సాగును ప్రోత్సహించి కొబ్బరి విలువ ఆధారిత పరిశ్రమల ఏర్పాటుకు చొరవ తీసుకోవాలన్నారు. తీరప్రాంతం వెంబడి ఉన్న దేవాలయాలకు అనుబంధంగా సర్క్యూట్ టూరిజంను ఏర్పాటుచేసేలా కార్యాచరణ సిద్ధం చేయాలని దినకర్ సూచించారు. లంక గ్రామాల్లో తాగునీటి కనెక్షన్లు ఉన్నప్పటికీ నీటి సరఫరా లేదని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ చెప్పారు. కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ ఉపాధిహామీ పథకం ద్వారా కార్మికశాఖకు రావాల్సిన 1శాతం నిధులను ఇప్పించాలని కోరారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ మాట్లాడుతూ నరేగా వేతనాల చెల్లింపుల్లో 20 శాతం తగ్గించడం జరుగుతోందని, ఇది ఉపాధి హామీ పథకం ఆశయ సాధనకు అవరోధంగా ఉందన్నారు. సమావేశంలో కలెక్టర్ మహేష్‌కుమార్, జేసీ టి.నిషాంతి, డీఆర్వో బీఎల్ఎన్ రాజకుమారి పాల్గొన్నారు.

ఓడినా.. గెలవొచ్చు!

ఇంటర్ పరీక్షల ఫలితాలు శనివారం విడుదల కానున్నాయి. పరీక్షలు రాసిన నాటి నుంచి రిజల్ట్స్ కోసం ఉత్కంఠగా ఎదురుచూస్తున్న విద్యార్థులకు మరికొద్ది గంటల్లోనే ఫలితాలు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వస్తున్నాయి. ఈసారి వివిధ వెబ్‌సైట్‌లతోపాటు వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే అవకాశాన్ని కల్పించారు. ఒకప్పుడు పరీక్షల ఫలితాలు వస్తున్నాయంటే ఎంతో హడావుడి. ఫలితాలు ప్రకటించిన తర్వాత మరుసటి రోజు పేపర్ చూసి తమ నెంబరు ఉందో లేదో చూసుకునే వరకూ ఉత్కంఠే. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఫలితాలు ప్రకటించిన మరుక్షణం ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ఇప్పటివరకూ ప్రభుత్వం నిర్దేశించిన వెబ్‌సైట్లు, పత్రికల ద్వారానే ఫలితాలు అందుబాటులో ఉండేవి. ఇప్పుడు పలు వెబ్‌సైట్లతో పాటు తాజాగా వాట్సాప్ ద్వారా ఫలితాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు.



- ఆంధ్రజ్యోతి/ రాజమహేంద్రవరం/ పిఠాపురం

- నేడు ఇంటర్ పరీక్షల ఫలితాలు
- విద్యార్థుల్లో తీవ్ర ఉత్కంఠ
- ఒకేసారి ఫస్టియర్, సెకండియర్ రిజల్ట్స్
- అనుకున్న రీతిలో మార్కులు రాలేదని చింత వద్దు
- వెనువెంటనే మళ్లీ రాసేందుకు అవకాశం



నేటి ఉదయం 11 గంటలకు ఫలితాల వెల్లడి

తొలిసారి వాట్సప్‌లో కూడా..

ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ పరీక్షల ఫలితాలను శనివారం ఉదయం 11 గంటలకు ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేయనున్నది. ఫలితాలు https://results-bie.ap.gov.in వెబ్‌సైట్‌తోపాటు పలు ప్రైవేటు వెబ్‌సైట్లల్లో అందుబాటులో ఉండనున్నాయి. ఆన్‌లైన్‌తోపాటు మన-మిత్ర వాట్సాప్ నెంబరు 95523 00009కు మెస్సేజీ పంపి ఫలితాలు తెలుసుకునే వెసులుబాటు కల్పించారు. వాట్సాప్‌లో పై నెంబరుకు 'హాయ్' అని మెసేజ్ పంపాలి. రిప్లయ్‌లో వచ్చే ఆప్షన్లలో 'సెలక్ట్ సర్వీస్' ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. తర్వాత 'ఎడ్యుకేషన్ సర్వీసెస్' ఆప్షన్‌ను క్లిక్ చేయాలి. ఇంటర్ ఫలితాల డౌన్‌లోడ్ ఆప్షన్ కనబడుతుంది. ఫలితాల డౌన్‌లోడ్ ఆప్షన్ యాక్టివ్ అయ్యాక హాల్ టిక్కెట్ నెంబర్ ఎంటర్ అడుగుతుంది. వెంటనే మీ వాట్సాప్ నెంబరుకు ఫలితాలు వెల్లడి అవుతాయి. మార్కుల షార్ట్ మెమో పీడీఎఫ్‌ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈసారి మరింత వేగంగా ఫలితాలు తెలుసుకునే అవకాశం ఏర్పడిందనే చెప్పారు. ఇక ఫలితాలు ప్రకటిస్తామని సమాచారం వచ్చిన దగ్గరనుంచి విద్యార్థుల్లో టెన్షన్ మొదలైంది. తమ ఫలితాలు ఎలా ఉంటాయోనని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. అనుకున్న రీతిలో మార్కులు వస్తాయా, ఉత్తీర్ణ సాధిస్తామా అని ఆలోచనలతో సతమతమవుతున్నారు. ఉదయం 11 గంటలకు విద్యార్థులకు ఫలితాలు తెలియజెప్పేందుకు మీసేవా కేంద్రాలతోపాటు ఇంటర్నెట్ సెంటర్లు సిద్ధమయ్యాయి.

● కాసేపు ప్రశాంతంగా ఉండండి..

ఫలితాలు వెలువడే రోజున పిల్లల్లో తీవ్రమైన మానసిక ఒత్తిడి ఉంటుంది. ఏవేవో ఆలోచనలతో సతమతమవుతూ ఉంటారు. ఏ పనిపైనా ధ్యాస ఉండదు. దృష్టి అంతా రిజల్ట్స్‌పైనే ఉంటుంది. నిజమే ఏడాది, రెండేళ్ల పడిన కష్టానికి కాగితంపై ఫలితం చూసుకునే రోజు. కానీ ఇదే జీవితంలో చివరి రోజు కాదు.. ఆ కాగితమే జీవితానికి పరమావధి కానేకాదని గుర్తెరగాలి. శక్తి వంచన లేకుండా ప్రయత్నించడమే మన వంతు.. ఫలితం అనేది మనం శాసించేది కాదని తెలుసుకోవాలి. ఫలితం అనుకున్నట్లు వస్తే హ్యాపీనే. కానీ కాస్త అటుఇటూ అయినా ఆలోచనలు మన అదుపులో ఉంటుకోవడమే జీవితంలో పాస్ కావడానికి నిజమైన ముడిసరుకు. పరీక్షలో పాస్ కాకపోతే ఆకాశం కూలిపోయి తక్షణమే మీద పడిపోదు. ఇంకా మెరుగైన సాధనకు ఉపకరిస్తుంది. సబ్జెక్టుపై పట్టు సాధించడానికి ఆ సమయాన్ని వినియోగించుకోవాలి. ఒకవేళ రకరకాల ఆలోచనలు మిమ్మల్ని చుట్టుముడితే వెంటనే ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించాలి. యోగా, ధ్యానం, వ్యాయామం వంటివి చేయడం ద్వారా మానసిక శక్తిని పెంపొందించుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. ఎవరో ఎద్దేవా చేస్తారని, మరెవరికో సమాధానం ఎలా చెప్పుకోవాలని.. ఇలాంటి ఆలోచనలను దగ్గరకు రానివ్వద్దు. ఈసారి మంచి ఫలితం సాధించడానికి దారులు వెతకండి, ప్రణాళిక వేసుకోండి. ఇవాళ గొప్ప వాళ్లందరూ ఒక రోజులో ఉన్నత స్థాయికి చేరలేదు. ఎన్నో ప్రయత్నాల ఫలితంగా గొప్ప వాళ్లయ్యారు. ఇంకా చెప్పాలంటే టెన్త్, ఇంటర్‌లలో ఫెయిల్ అయి తర్వాత దూసుకుపోయిన వారే ఎక్కువ. జీవితంలో ఓడిపోయామని అనుకోవడమే అసలు ఫెయిల్యూర్ అని గుర్తు పెట్టుకోండి.

● తల్లిదండ్రులూ సంయమనం



మా అమ్మాయి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యిందని ఎవరో చెప్పే మాటకు సమాధానంగా మా అబ్బాయి ఫెయిలయ్యాడని చెప్పాల్సి రావడం ఏదో పెద్ద సమస్య నెత్తిన పెట్టినట్టు అనుకోవద్దు. పిల్లలను ఇంట్లో వాళ్లే దగ్గరకు తీసుకోకపోతే కుంగిపోతారు. వారి మానసికస్థితి తీవ్రమైన నిర్ణయాల వైపు మళ్లుతుంది. ముందుగా ఇంటినుంచే ధైర్యం చెప్పడం మొదలవ్వాలి. ఇప్పుడేమైంది... మళ్లీ ప్రయత్నం చేద్దాం.. ఈసారి కుమ్మేద్దాం.. ఇలా ఉత్సాహపరిచే మాటలు పిల్లలకు తల్లిదండ్రులు చెప్పాలి. అవసరమైతే అదేరోజు కాస్త బయటకు తీసుకెళ్లి వాతావరణాన్ని తేలిక చేసే పని చేయాలి. రిజల్ట్స్ వచ్చిన తర్వాత పిల్లల అనుపానువులను దగ్గరగా గమనిస్తూ ఉండాలి. సెల్‌ఫోన్లను పరిశీలిస్తూ ఉండాలి. ఏ మాత్రం అనుమానం కలిగినా ఓ స్నేహితుడి మాదిరిగా తండ్రి మారిపోవాలి. దగ్గరకు తీసుకొని జీవన గమనానికి భరోసానివ్వాలి. ఒకవేళ మరీ ఇబ్బందిగా ఉంటే కౌన్సెలింగ్ ఇప్పించాలి. చుట్టాలు కూడా ఏదో జరిగిపోయినట్లు పరామర్శించడం చేయకూడదు. గతంలో తన బిడ్డ ఇంటర్ ఫెయిల్ అయితే ఓ తండ్రి పెద్ద వేడుక చేసి మటన్‌తో భోజనాలు పెట్టారు. తన బిడ్డ ఇంటర్ పరీక్ష తప్పాడేగానీ జీవితాన్నికాదు.. అని సమాజానికి ఓ మేసేజ్ ఇవ్వడమే తన ఉద్దేశమని ఆ తండ్రి చెప్పారు. అందరినీ వేడుక చేయాలని చెప్పడం కాదుగానీ.. పిల్లల మనోధైర్యానికి తల్లిదండ్రులే భరోసా.

● నిపుణులూ అదే చెబుతున్నారు..

ఇంటర్ పరీక్షల్లో అనుకున్న రీతిలో ఫలితాలు రాలేదని విద్యార్థులు క్షణికావేశంలో ఎటువంటి నిర్ణయాలు తీసుకోవద్దని విద్యావేత్తలు సూచిస్తున్నారు. అనుకున్న రీతిలో మార్కులు రాకపోయినంత మాత్రాన వారి ప్రతిభ ఎక్కడికి పోదని, భవిష్యత్తులో మరింత పట్టుదలతో మార్కులు సాధించాలని తెలిపారు. అదేవిధంగా పరీక్షల్లో ఫెయిలయితే ఇక జీవితం లేదనే భావన వద్దని, పరీక్షల్లో తప్పినా వెంటనే పరీక్షలు రాసే అవకాశం ఉందని వారు గుర్తుచేస్తున్నారు. అంతేతప్ప జీవి తం చాలిస్తే మన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత బాధపడతారో ఆలోచించాలని వారు సూచిస్తున్నారు. ఫలితం విద్యార్థి జీవితంలో ఒక భాగమని, అదే జీవితం అనుకోవద్దని చెబుతున్నారు. ఫలితాలు ఆశించిన స్థాయిలో రాకుంటే ఎక్కడ లోపం ఉందో తెలుసుకుని దానిని అధిగమించేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఏదైనా పరీక్ష తప్పితే వెంటనే ఆ తప్పును సరిదిద్దుకునే అవకాశాన్ని కల్పిస్తారు. లేదంటే ఇష్టమైన ఉపాధి, ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పొంది జీవితంలో ఎదిగిన కథలెన్నో మన కళ్ల ముందే ఉంటాయి. ఒక్కసారి పరిశీలించండి.

పసిడి పైపైకి..



- మూడునెలల 10రోజుల్లో రూ.15వేలు పెరిగిన ధర
- 10గ్రాముల 22 క్యారెట్ ధర రూ. 85, 450

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

బంగారం ధర రికార్డుస్థాయిలో పెరిగిపోయింది. ఇప్పటివరకూ ఇంత ధరకు చేరడం ఇదే మొదటిసారి వ్యాపారులు, వినియోగదారులు చెబుతున్నారు. జనవరి 1నుంచి ఏప్రిల్ 11వతేదీకి అంటే 3నెలల 11రోజులకు ఏకంగా గ్రాము బంగారం ధర రూ.15000 పెరిగింది. బంగారం ధర జనవరి 1న 22క్యారెట్ 10 గ్రాములు రూ.71,150గా ఉండగా ఇప్పుడు ధర రూ.85,450కు చేరింది. ఇక 24 క్యారెట్ బంగారం ధర జనవరి 1న రూ.78వేలు ఉండగా ఇప్పుడు రూ.95,400 ఉంది.

లక్షకు చేరువలో..

ప్రస్తుతం శుభకార్యాల సీజన్ మొదలవుతోంది. ఈ నేపథ్యంలో పసిడి ధరలు పెరగడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ఇంకో రూ.4,600 పెరిగితే 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర రూ.లక్షకు చేరుతుంది. ఈ పరిస్థితుల్లో బంగారం కొనాలా వద్దా అనే డైలామాలో వినియోగదారులు ఉన్నారు. పుత్తడి ధర కొద్దిరోజుల క్రితం కొంత పెరిగి మళ్లీ తగ్గింది. రెండురోజులుగా మళ్లీ పెరుగుతూ, శుక్రవారం నాటికి ఏకంగా రికార్డుస్థాయికి చేరింది. ఇక వెండి ధర గతనెలలో కిలో రూ.లక్ష దాటేసిన సంగతి తెలిసిందే. కానీ ఇటీవల మళ్లీ తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం కిలో వెండి ధర రూ.95,500గా ఉంది. జనవరి 1న కిలో వెండి ధర రూ.88,400 మాత్రమే. ఈ పరిస్థితుల్లో వినియోగదారులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. బంగారం పెట్టుబడి వస్తువుగా మారిపోవడంతో అందరికీ మక్కువ పెరిగింది. కానీ ధరలు వినియోగదారులను ఇబ్బంది పెడుతున్నాయి.

సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో

రెండు పంచాయతీల ఎంపిక



- ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక, గండేపల్లి మండలంలోని తాళ్లూరు పంచాయతీలకు ఏ-గ్రేడ్

ఆత్రేయపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో 2022-23 సంవత్సరానికి సంబంధించి దేశంలో గ్రామ పంచాయతీలు సాధించిన పురోగతి ఆధారంగా కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ సూచీలను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో భాగంగా రాష్ట్రంలో నాలుగు పంచాయతీలు ఏ-గ్రేడ్ సాధించినట్లు ప్రకటించారు. ఇందులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆత్రేయపురం మండలంలోని బొబ్బర్లంక, గండేపల్లి మండలంలోని తాళ్లూరు పంచాయతీలున్నాయి. 76.76మార్కులతో బొబ్బర్లంక గ్రామపంచాయతీ ఏ-గ్రేడ్ సాధించింది.

అభివృద్ధి పథంలో బొబ్బర్లంక



బొబ్బర్లంక గ్రామాన్ని అభివృద్ధి పథంలో నిలిపేందుకు పాలకవర్గం పంచాయతీ సిబ్బంది అహర్నిశలు శ్రమించారు. గ్రామంలో ప్రజల అవసరాలను పరిష్కరించేందుకు శక్తివంచన లేకుండా కృషిచేశాం. కనీస అవసరాలైన తాగునీరు, వైద్యం, అపారిశుధ్య నిర్మూలనకు పాటుపడ్డాం. ఏ-గ్రేడ్ పంచాయతీగా ఎంపిక కావడం ఆనందదాయకం.

-నరాలశెట్టి సుబ్బలక్ష్మి, సర్పంచ్, బొబ్బర్లంక, ఆత్రేయపురం మండలం

వైభవంగా శ్రీవారి తెప్పోత్సవం

- హంసవాహనంలో విహరించిన స్వామి
- ఐదోరోజు వెంకన్న కల్యాణోత్సవాలు




స్వామివారిని గోదావరి వద్దకు ఊరేగింపుగా తీసుకువెళుతున్న దృశ్యం, గోదావరి నదిలో స్వామివారికి తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ఆత్రేయపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఐదోరోజు శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామునే మేలుకొల్పు, తీర్థపు బిందెతో గోదావరి జల సంగ్రహణ, నిత్యార్చన, నిత్యహోమాలు, దిగ్వేవత బలిహరణ, నీరాజన మంత్రపుష్పం, ద్రవిడ వేద పారాయణ తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఖండవిల్లి రాజేశ్వరవరప్రసాదాచార్యులు బ్రహ్మత్వంలో వేదపండితులు ఆలయ ప్రదక్షిణ, ప్రధానహోమాలు, దిగ్వేవత బలిహరణ కార్యక్రమాలను నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులకు పూజల అనంతరం పల్లకిలో మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ గౌతమి గోదావరి నదీతీరానికి ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం స్వామివారి తెప్పోత్సవం, కన్నులపండువగా జరిపారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాలతో అలంకరించిన హంస వాహనంలో స్వామివారు కొలువుదీరి పూజలు అందుకున్నారు. ఈ సందర్భంగా మిరుమిట్లుగొలిపే బాణసంచాకాల్పులు ఆకట్టుకున్నాయి. ఆలయ ఉపకమిషనర్ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు నిర్వహించారు. అధికసంఖ్యలో భక్తులు తెప్పోత్సవాన్ని తిలకించారు. గోదావరి ప్రాంతం భక్తజన గోవిందనామస్మరణతో మార్మోగింది. కొత్తపేట ఆర్డీవో శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

బీఈడీ తరగతులు

సమర్థవంతంగా నిర్వహించాలి

- నన్నయ వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



మూల్యాంకనం పరిశీలిస్తున్న వీసీ ప్రసన్నశ్రీ

దివాన్‌చెరువు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బీఈడీ తరగతులు సమర్థవంతంగా నిర్వహించాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ బీఈడీ అధ్యాపకులకు సూచించారు. నన్నయ విద్యాకళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రికార్డుల మూల్యాంకనంను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నన్నయ విశ్వవిద్యాలయం పరిధిలో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని 38 అనుబంధ విద్యాకళాశాలలకు చెందిన 2500 రికార్డులు మూల్యాంకనం ప్రక్రియ నన్నయ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్నారని చెప్పారు. అన్ని విభాగాల కంటే విద్యావిభాగానికి ఎంతో ప్రత్యేకత, ప్రాధాన్యం ఉందన్నారు. భావితరాలకు గురువులుగా బీఈడీ విద్యార్థులు ఉంటారని, విద్యార్థులకు విద్యతోపాటు విలువలను నేర్పించి ఉత్తమంగాతీర్చిదిద్దాలన్నారు. మూల్యాంకనానికి సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, విద్యాకళాశాల ప్రిన్సిపాల్ కె.సుబ్బారావు, అధ్యాపకులు ఆర్.సాంబశివరావు, ఎం.గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఫార్మాసిస్టుల ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో మెరిట్ లిస్ట్

జీజీహెచ్(కాకినాడ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా నేషనల్ అర్బన్ హెల్త్‌మిషన్ ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం స్వీకరించిన దరఖాస్తులకు సంబంధించి మెరిట్‌లిస్ట్‌ను ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామని డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నోటిఫికేషన్ ప్రకారం ఫార్మాసిస్ట్ (3), పోస్ట్ డేటాఎంట్రీ ఆపరేటర్ (1), లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ ఎల్‌జీఎస్ (4)పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించామన్నారు. మెరిట్‌లిస్ట్‌ను శుక్రవారం ఎన్ఐసీ వెబ్‌సైట్‌లో పొందుపర్చామన్నారు. అభ్యర్థులు తమ మెరిట్‌లిస్ట్‌ను-http://eastgodavari.ap.gov.in,http://kakinada.ap.gov.in,http://konaseema.ap.gov.in వెబ్‌సైట్‌లో చూసుకోవాలని ఆయన కోరారు.

అరబిందో ఫార్మా కంపెనీలో

పూల్ క్యాంపస్ డ్రైవ్

- 200 మంది హాజరు



వీసీ సీఎస్ఆర్కే ప్రసాద్‌ను కలిసిన అరబిందో ఫార్మా ప్రతినిధులు

జేఎన్టీయూకే, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని అలూమ్నీ ఆడిటోరియంలో ఐఐపీటీ డైరెక్టరేట్, స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ టెక్నాలజీస్ సంయుక్త ఆధ్వర్యంలో బీ.ఫార్మసీ, ఎం.ఫార్మసీ, బీఎస్సీ, ఎమ్మెస్సీ కెమిస్ట్రీ, ఐటీఐ, డిప్లమో పూర్తిచేసిన, ఆఖరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు హైదరాబాద్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ శుక్రవారం పూల్ క్యాంపస్ డ్రైవ్‌ను నిర్వహించింది. ముందుగా కంపెనీ ప్రతినిధులు ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌ను, ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్‌ను కలిసి కంపెనీ కార్యకలాపాలను వివరించారు. పూల్ క్యాంపస్ డ్రైవ్‌లో భాగంగా ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు హైదరాబాద్‌లోని అరబిందో ఫార్మా కంపెనీ ఫౌండేషన్ స్కిల్‌డవలప్‌మెంట్ సెంటర్లో నాలుగు నెలల పాటూ స్టయిఫండ్‌తో కూడిన శిక్షణనిచ్చి కంపెనీకి చెందిన యూనిట్లలో ఉద్యోగాలిస్తామన్నారు. 300 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు రిజిస్ట్రేషన్ చేసుకోగా పూల్ క్యాంపస్ డ్రైవ్‌కు 200 మంది హాజరయ్యారని వారిలో 150 మంది ఆన్‌లైన్ పరీక్షలో అర్హత సాధించి టెక్నికల్ రౌండ్‌కు ఎంపికైనట్లు ఐఐపీటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీటీ కృష్ణ తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని కంపెనీ ప్రతినిధులన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ టెక్నాలజీస్ డైరెక్టర్ కె.పద్మప్రియ, కంపెనీ మేనేజర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



కల్యాణం.. వైభోగం

రఘువంశ రామయ్య.. సుగుణాల సీతమ్మ
వరమాలకై వేచె సమయాన..
శివధనువు విరిచాకె.. వధువు మది గెలిచాకె
మోగింది కల్యాణ శుభవేళ..
కల్యాణం.. వైభోగం.. శ్రీరామచంద్రుని కల్యాణం...

అన్నట్లుగా ఏకశిలానగరం పులకరించింది. శ్రీరామ నామస్మరణతో ఒంటిమిట్ట మార్మోగింది. ఆంధ్రా భద్రాద్రి, దక్షిణాది అయోధ్యగా పేరొందిన ఏకశిలానగిరి ఒంటిమిట్ట కోదండరామాలయంలో శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిండు వెన్నెలలో సీతారాముల కల్యాణాన్ని టీటీడీ ఆధ్వర్యంలో నభూతో నభవిష్యతి అన్న రీతిలో నిర్వహించారు. ముందుగా రామయ్యకు యజ్ఞోపవీతం, సీతమ్మకు స్వర్ణ కిరీటం కానుకగా అందించారు. ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దంపతులు అందించారు. స్వామివారి కల్యాణాన్ని చూసేందుకు భక్తులు విశేషంగా తరలి రావడంతో ఒంటిమిట్ట జనసంద్రంగా మారింది.



పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు తీసుకొస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దంపతులు



కళాకారుల నృత్యం






ఆలయ శిల్పకళను పరిశీలిస్తున్న సీఎం



ఎదుర్కోలు దృశ్యం





సీతారాముల కల్యాణం తిలకిస్తున్న చంద్రబాబు దంపతులు

కార్పొరేషన్ కార్యాలయంలో
అగ్నిప్రమాదం
మంటలు ఆర్పిన సెక్యూరిటీ



దగ్ధమైన టేబుల్, రికార్డులు



రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం కార్పొరేషన్ కార్యాలయంలోని గ్రౌండ్ ఫ్లోర్‌లోని కొన్ని పాత వస్తువులు నిల్వ చేసిన బిల్లు కలెక్టర్‌ల విభాగం గదిలో విద్యుత్ షార్‌సర్క్యూట్ అయ్యి అగ్నిప్రమాదం సంభవించింది. శుక్రవారం ఉదయం 7 గంటల సమయంలో ఈ గదిలో గోడకు అమర్చిఉన్న సైడ్ ఫ్యాను గుండా నిప్పులు చెలరేగి కింద ఉన్న పాత టేబుల్, దానిపై ఉన్న పాత ఫైల్స్ (వ్యర్థమైనవి) పాక్షికంగా దగ్ధమయ్యాయి. మంటల పొగ రావడంతో సెక్యూరిటీ సిబ్బంది అప్రమత్తమై ఫైర్ సేఫ్టీ గ్యాస్‌తో మంటలను అదుపుచేశారు. ఘటనలో పాక్షిక నష్టం జరిగింది. అయితే అదే రూమ్‌లో ఇంకా పాత ఫైల్స్, సెంట్రల్ ఏసీ అవుట్‌డోర్ కంప్రెజర్ల భద్రపరిచే పెద్దపెద్ద కాగితపు అట్ట బాక్సులు, ఫర్నీచర్ ఉంది. వెంటనే స్పందించకపోతే క్షణాల్లో దగ్ధమై పెద్దప్రమాదమే జరిగి ఉండేది.

డీఎల్‌డీవో కార్యాలయానికి రంపచోడవరం పీఆర్ అతిథిగృహం కేటాయింపు

రంపచోడవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఉన్న పీఆర్ అతిథి గృహాన్ని డివిజనల్ స్థాయి డెవలప్‌మెంట్ అధికారి కార్యాలయానికి కేటాయించినట్టు జిల్లా పరిషత్ ముఖ్య కార్యానిర్వాహణాధికారి వీవీవీఎస్ లక్ష్మణరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ గృహాన్ని ప్రభుత్వం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కోసం కోరుతూ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి గతంలో జిల్లా పరిషత్ సీఈవోకు గతంలో లేఖ రాశారు. ఆ లేఖను పరిశీలించిన సీఈవో ఎమ్మెల్యేకు కేటాయించడం సాధ్యం కాదని పేర్కొన్నారు. కాగా అదే అతిథి గృహంలో వైసీపీ ఎమ్మెల్సీ వైసీపీ జట్పీటీసీ కార్యాలయం నడుస్తుండడంతో వివాదంగా మారింది. దీనిపై శుక్రవారం వివిధ పత్రికల్లో జిల్లా పరిషత్ సీఈవోపై వచ్చిన కథనాలపై ఆయన వివరణ ఇచ్చారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, పంచాయితీ కార్యదర్శి ఇచ్చిన సూచనల మేరకు పీఆర్ అతిథి గృహాన్ని డివిజన్ స్థాయి అభివృద్ధి అధికారికి కేటాయించడం జరిగిందని పేర్కొన్నారు.

సారూ... మరిచారా రూలు!



మీకు రూల్స్ పాటించడమే వచ్చు.. మాకు బ్రేక్ చేయడం కూడా వచ్చు.. ఇది ఓ సినిమాలోని పోలీసు డైలాగ్. ఈ ఫొటో చూస్తుంటే ఆ డైలాగ్‌ని నిజం చేసినట్టుంది కదండి!. హెల్మెట్ లేదు.. బండికి నెంబరు లేదు.. సెల్‌ఫోన్ మాట్లాడుకుంటూ.. ఒక చేత్తో డ్రైవింగ్ చేస్తూ ఓ పోలీసు అధికారి యూనిఫామ్‌లో బుల్లెట్‌పై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు రోడ్డులో వెళ్తూ కనిపించిన వైనమిది. రూల్స్ సాధారణ ప్రజలకే గానీ మాకు కాదన్నట్టు ఉన్న అధికారి వ్యవహార శైలి చూసి అటుగా వెళ్తున్నవారు విస్తుపోయారు.

–రాజమహేంద్రవరం(ఆంధ్రజ్యోతి)

ఉత్సాహం.. ఉరకలు..

- చేబ్రోలులో గుర్రాల పరుగు ప్రదర్శన పోటీలు
- భారీగా తరలివచ్చిన ప్రజలు, కిక్కిరిసిన రహదారులు
- అనకాపల్లి అశ్వానికి మొదటిస్థానం



చేబ్రోలులో నిర్వహించిన పోటీల్లో పరుగెడుతున్న గుర్రం

గొల్లప్రోలురూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన పోటీలు నిర్వహించగా ఉత్సాహపూరిత వాతావరణంలో సాగాయి. చేబ్రోలు బైపాస్‌రోడ్డులో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నివాసం చెంతనే ఉన్న రహదారిలో సీతారామా ఆలయకమిటీ, జనసేన ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 30కిపైగా గుర్రాలు పాల్గొన్నారు. ఈ ప్రాంతంలో తొలిసారి గుర్రాల పోటీలు నిర్వహించడంతో వీటిని తిలకించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు భారీగా తరలివచ్చారు. పరిసర రహదారులన్ని జనసందోహంతో కిక్కిరిసిపోయాయి. గుర్రాలు పరుగెడుతుంటే ఉత్సాహంగా వారి వెంట పరుగెత్తేందుకు ప్రజలు ప్రయత్నించడంతో వారిని నియంత్రించడం నిర్వాహకులకు కష్టసాధ్యంగా మారింది. పోటీల్లో తొలి పది స్థానాల్లో నిలిచిన గుర్రాలకు నగదు పురస్కారాలు, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో అనకాపల్లి, పాయకరావుపేట జనసేన ఇన్‌చార్జిలు గడ్డం బుజ్జి, ఓరుగంటి పెదకాపు, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ వైస్‌చైర్మన్ బుర్రా అనుబాబు, ఓరుగంటి దొరబాబు, బుద్దాల చంటి, చల్లా లక్ష్మి, శివ, పిఠాపురం సీఐ శ్రీనివాస్, గొల్లప్రోలు ఎస్ఐ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విజతలు వీరే...

రాష్ట్రస్థాయి గుర్రాల పరుగు ప్రదర్శన పోటీల్లో నిర్దేశించిన 2.20 కిలోమీటర్ల దూరాన్ని అనకాపల్లి జిల్లా చేనుల అగ్రహారం మణి(జెస్సీ)కి చెందిన గుర్రం 3 నిమిషాల 2 సెకన్ల 18 పాయింట్ల సమయంలో పరుగెత్తి ప్రథమస్థానంలో నిలిచింది. రామన్నపాలెం చోడమాంబిక విక్రమ్ గుర్రం 3-21-08 సమయంలో, అంకుపాలెం మోదమాంబ మురుగన్ గుర్రం 3-21-87 సమయంలో, ఆర్ఆర్‌పేట దాడి రాముడు(భగి) గుర్రం 3-22-37, దేవర సింగపూరు సత్యనారాయణ గుర్రం 3-25-54, కోటనందూరు శివరాజు బ్రదర్స్(రాఖీ) గుర్రం 3-27-05, సామర్లకోట జగదీష్ రాజా గుర్రం 3-30-17, శివరాజు బ్రదర్స్(చిన్ని) గుర్రం 3-31-11, ఆర్ఆర్ పేట దాడి నూర్ హనుమంత్ (చిన్ని) గుర్రం 3-31-92, రామన్నపాలెం చోడమాంబిక రాకెట్ గుర్రం 3-32-65 సమయంలో పరుగెత్తి తొలి పదిస్థానాల్లో నిలిచాయి. బెస్ట్ రైడర్‌గా మణికంఠ ఎంపికయ్యారు.



పోటీలు తిలకించేందుకు భారీగా తరలివచ్చిన జనసందోహం



ప్రథమ విజేతకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

అన్నవరంలో సీతారాములకు...
వేడుకగా వనవిహార మహోత్సవం



వనవిహారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రపాలకులైన సీతారాముల దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం వనవిహార మహోత్సవం వేడుకగా జరిగింది. సాయంత్రం 4గంటలకు నవదంపతులైన సీతారాములను, పెళ్లి పెద్దలైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను కొండపై నుంచి మేళతాలాలతో కొండదిగువన ఉన్న దేవస్థానం ఉద్యానవనానికి తోడ్కొనివచ్చారు. ప్రత్యేక వేదికలపై ఆశీనులు గావించి పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు. చతుర్వే పండితులు వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. వివాహ బడలికలో ఉన్న నవదంపతులు సేదతీరేందుకు ప్రతీకగా ఈ వేడుకను నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

సీతారాముల కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం నవదంపతులకు చక్రస్నాన కార్యక్రమం నిర్వహిస్తారు. సాయంత్రం 4గంటలకు నాకబలి, దండియాడింపు కార్యక్రమాలు ఉంటాయి.

కలశ పునఃప్రతిష్ఠ పూజలు

అన్నవరం దత్తత దేవాలయమైన నర్సీపట్నం మండలం బలిఘట్టం సత్యదేవుని ఆలయంలో శుక్రవారం కలశ పునఃప్రతిష్ఠ పూజలు వైభవోపేతంగా జరిగాయి. ఆలయ దత్తత సమయంలో కలశప్రతిష్ఠ చేపట్టగా వానరాలు వాటిని ధ్వంసం చేశాయి. విషయం తెలుసుకున్న దేవస్థానం అధికారులు శుక్రవారం అక్కడకు పండితులతో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఏఈవో కొండలరావు తదితరులు ఉన్నారు.



కలశ పునఃప్రతిష్ఠ నిర్వహిస్తున్న పండితులు

'లోవ'లో శాస్త్రోక్తంగా మెట్లోత్సవం



ఆలయంలో నిర్మించిన మెట్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

తుని రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రముఖ పుణ్యక్షేత్రం తలుపులమ్మ లోవలో శుక్రవారం మెట్లోత్సవం శాస్త్రోక్తంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తుని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే దివ్య హాజరయ్యారు. ఆమెకు ఆలయాధికారులు, ఈవో విశ్వనాథరాజు ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. రూ.30లక్షలతో ప్ర త్యేకమైన రాతితో నిర్మించిన సుమారు 60 మెట్లను పసుపు, కుంకుమ పెట్టి ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ భక్తులకు ఎంతో సౌకర్యవంతంగా ఉండే ప్రత్యేకమైన రాతితో మెట్లను దేవస్థానం అధికారులు నిర్మించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో లోవ దేవస్థానాన్ని మరింత అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు యనమల రాజేష్, చింతమనీడి అబ్బాయి, సుర్ల లోవరాజు పాల్గొన్నారు.

నేడు ఎడ్లపరుగు పోటీలు

గొల్లప్రోలు రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శనివారం రాష్ట్రస్థాయి ఎడ్ల పరుగు పోటీలు జరగనున్నాయి. సీతారామస్వామి ఆలయకమిటీ, జనసేన పార్టీ ఆధ్వర్యంలో జరిగే పోటీల సీనియర్, జూనియర్ విభాగాల్లో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాల నుంచి ఎడ్ల జతలు ఇప్పటికే చేబ్రోలు చేరుకున్నాయి. చేబ్రోలు అడవి పుంత రోడ్డులో ఉదయం 6 గంటలు నుంచి పోటీలు ప్రారంభవుతాయి.

రైలు ఢీ కొని వ్యక్తి మృతి

తుని రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీ కొని వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. అన్నవరం రావికంపాడు రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని రైలు 45ఏళ్ల వ్యక్తిని ఢీకొనడంతో అక్కడకక్కడే మృతిచెందినట్టు రైల్వే పోలీసులు తెలుపుతున్నారు. వివరాలు కానరాకపోవడంతో మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి రైల్వే పోలీసుల తరలించి భద్రపరిచారు. వివరాలు తెలిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ జి.శ్రీనివాసరావు కోరారు.

విరగకాసే.. కనువిందు చేసే

కాకినాడ జిల్లా సామర్లకోట ఏడీబీ రోడ్డులోని పామాయిల్ తోటలో ఓ పనస చెట్టుకు ఏకంగా 132 కాయలు కాసి కనువిందు చేస్తుంది. చెట్టుకు 3 అడుగుల నుంచి సుమారు 50 అడుగుల ఎత్తు వరకూ వివిధ పరిమాణాల్లో పనసకాయలు కాశాయి. అలాగే సామర్లకోట బీబీఆర్ ఉన్నత పాఠశాల ఎదుట వీధిలో కర్రి సూర్యనారాయణకు చెందిన ఇంటి ఆవరణలో చెట్టు మొదలు ఆరు అంగుళాల ఎత్తు నుంచి సుమారు 15 అడుగుల ఎత్తు వరకూ సుమారు 42 పనసకాయలు కాశాయి.

–సామర్లకోట(ఆంధ్రజ్యోతి)





హాకీ చాంపియన్‌షిప్ విజేత కాకినాడ



ట్రోఫీ అందుకుంటున్న కాకినాడ జిల్లా జట్టు సభ్యులు

కార్పొరేషన్(కాకినాడ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 6 నుంచి 9 వరకు ధర్మవరం శ్రీ సత్యసాయి జిల్లాలో జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అంతర్ జిల్లా జూనియర్ బాలుర హాకీ చాంపియన్‌షిప్ పోటీలకు సంబంధించి ఫైనల్స్‌లో కాకినాడ జిల్లా జట్టు కడప జిల్లా జట్టుపై 2-0 తేడాతో గెలుపొంది విజేతగా నిలిచిందని జిల్లా హాకీ సంఘ కార్యదర్శి నందు శ్రీనివాసరావు తెలిపారు. జట్టును జిల్లా క్రీడాభివృద్ధి అధికారి బి.శ్రీనివాస్‌కుమార్ అభినందించారు. కోచ్‌లు వి.రవిరాజు, నాగేంద్రకుమార్, జిల్లా హాకీ సంఘ అధ్యక్షులు ఏ.బాబ్జి, సంఘ కార్యదర్శి కె.నూకరాజు, వ్యాయామ ఉపాధ్యాయులు సునీల్, సూరిబాబు, పరశురాం, పరశురాం ఉన్నారు.

ధర్మవరంలో వైభవంగా కలశాల ఊరేగింపు

ప్రత్తిపాడు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామంలో అయ్యప్పస్వామి జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం 108 కలశాలతో ర్యాలీ నిర్వహించారు. గురుస్వాములు, వేలు చంటిల పర్యవేక్షణలో ధర్మవరం అయ్యప్పస్వాముల ఆధ్వర్యంలో శివాలయం వద్ద అయ్యప్పస్వామికి పూజలు నిర్వహించి అనంతరం 108 మంది కలశాలతో స్వామిని వైభవంగా రథంపై ప్రధాన రహదారిపై ఊరేగించారు. 18 రకాల ద్రవ్యాలతో స్వామికి అభిషేకాలు నిర్వహించారు. ర్యాలీలో గ్రామ ప్రముఖులు ఎం.మురళీరాజు, దాట్ల అప్పన్నబాబు, బొల్లు కొండబా బు, ఇంధన ఏసుబాబు, నానిపల్లి చంటి, బొడ్డు వెంకటేశ్వరరావు, గంగాధర్ రాయుడు పాల్గొన్నారు.





కాకినాడ జిల్లా ధర్మవరంలో కలశాలతో ఊరేగింపు దృశ్యం

అత్తను కొట్టి చంపుతానని బెదిరించిన కోడలిపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అత్తను కొట్టి చంపుతానని బెదిరించిన కోడలిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. వివరాల ప్రకారం... తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరుకు చెందిన పోలినాటి దుర్గాప్రసాద్‌కు కాకినాడ జగన్నాధపురానికి చెందిన నాగమణితో వివాహం జరిగింది. ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో 2 ఏళ్లుగా విడిగా ఉంటున్నారు. దుర్గాప్రసాద్ నిడదవోలులో ఉంటున్నాడు. అప్పుడప్పుడు నాగమణి దొమ్మేరులోని అత్త పోలినాటి మంగాదేవి ఇంటికి భర్త గురించి ఆరా తీస్తూ అత్తతో గొడవపడి వెళ్తుంటుంది. ఈనెల 8న నాగమణి, ఆమె అక్క కుమార్తె దేవితో కలిసి వచ్చి అత్తను కొట్టి, చంపుతానని బెదిరించడంతో మంగాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామన్నారు.

నాలుగు సెమీ మెక్‌నైజ్డ్ ఇసుక రీచ్‌లు
అందరూ టన్నుకు రూ.35 కోట్ చేసిన వైనం
లాటరీలో విజేతలుగా నాలుగు కంపెనీలు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లాలో గోదావరి ఇసుక ర్యాంపుల్లో నాలుగు రీచ్‌లకు సెమీ మెకనైజ్డ్ ఇసుక రీచ్‌లుగా అనుమతిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాలో మొత్తం పది సెమిమెకనైజ్డ్ రీచ్‌లను గుర్తించగా అందులో జిల్లా అవసరాల కోసం నాలుగు రీచ్‌లకు టెండర్లు పిలిచారు. బ్రిడ్జిలంక, పక్కిలంక రీచ్‌లకు 43 దరఖాస్తులు, చిడిపికి 42, ఆరికరేవులకు 48, పురుషోత్తపల్లికి 29 మొత్తం 162మంది టెండర్ల దాఖలు చేశారు. అందులో 124 దరఖాస్తులు అర్హత సాధించాయి. కానీ ఈ 124మంది దరఖాస్తుదారులు టన్నుకు రూ.35 మాత్రమే కోట్ చేయడంతో అధికారులు లాటరీ తీశారు. అందులో ప్రక్కిలంక రీచ్ ఎనర్జీవో ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, డీపీ ర్యాంప్ గాలి సుబ్బరాజు కనస్ట్రక్షన్ కంపెనీకి, ఆరికరేవులను కేవీవీఎస్ఎన్ ఇన్‌ఫ్రా(ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, పురుషోత్తపల్లి శ్రీసాయిబాలాజీ కనస్ట్రక్షన్స్‌కు దక్కాయి. ఈ ర్యాంప్‌లను వారం రోజుల్లో నిర్వాహకులకు అప్పగించి ఇసుక తీత ఆరంభిస్తారని జేసీ ఎస్.చిన్నరాముడు, జిల్లా మైన్స్ అధికారి ఫణిభూషణ్ రెడ్డి తెలిపారు. ఈ ర్యాంప్‌ల నుంచి మొత్తం 24 లక్షల 6 వేల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యమవుతుందని స్పష్టం చేశారు. మునికూడలి పట్టాభూములకు చెందిన ర్యాంప్‌లను కొన్ని కారణాల వల్ల వాయిదా వేశారు. ఇక మరొక ఐదు మెకనైజ్డ్ రీచ్‌లను ఇతర జిల్లాలకు కేటాయించారు. పెండ్యాల రీచ్‌ను పశ్చిమగోదావరి జిల్లా, కుమారదేవం రీచ్‌ను విశాఖపట్నం అవసరాలకు, తాడిపూడి రీచ్ ఏలూరు జిల్లా అవసరాలకు, సింగవరం రీచ్ అనకాపల్లి అవసరాలకు, కాటవరం రీచ్‌ను కాకినాడ అవసరాలకు కేటాయించినట్టు తెలిపారు.

16 గ్రామాలకు ఆర్అండ్ఆర్ ప్రతిపాదనలు సిద్ధం
పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ అభిషేక్

ధవళేశ్వరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో చింతూరు పరిధిలో 32 గ్రామాలు ముంపు గ్రామాలుగా గుర్తించి లబ్ధిదారులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అమలుచేయడానికి ఇప్పటికే 16 గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి వారికి అందించాల్సిన ఆర్అండ్ఆర్ ప్యాకేజీ ప్రతిపాదనలు తన కార్యాలయానికి అందినట్టు ధవళేశ్వరంలోని ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్ ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన 16 గ్రామాలకు ఈనెల 30లోగా గ్రామసభలు నిర్వహించి తుది ప్రతిపాదనలు అందిన వెంటనే ఆర్అండ్ఆర్ కమిషనర్ అనుమతి కోసం పంపనున్నట్టు శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలో కలిసిన ముంపు బాధితులకు తెలియజేశారు.

సాగరతీరం.. విన్యాసాలమయం

కాకినాడలో కొనసాగుతున్న 'టైగర్ ట్రంప్-25'
పాల్గొన్న ఇండియా- అమెరికా దేశాల 1000 మంది త్రివిధ దళాల సభ్యులు



సర్పవరం జంక్షన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం సూర్యారావుపేట నేవల్ ఎన్‌క్లేవ్‌లో ఇండియా- అమెరికా త్రివిధ దళాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న టైగర్ ట్రంప్- 2025 యాంపీబీఎస్ విన్యాసాలు ఎంతో ఆకట్టుకున్నాయి. అమెరికాకు చెందిన యుద్ధ నౌకలతో పాటూ ఇండియాకు చెందిన ఐఎన్ఎస్ జలస్వ, ఐరావత్ యుద్ధనౌకలు ఈ విన్యాసాల్లో పాల్గొని యుద్ధ సమయంలో శత్రుదేశాలపై చేసే వీరోచిత పోరాటల ప్రదర్శన, దేశ అంతర్గత భద్రత, విపత్తులు, ఆపద సమయంలో మానవతా సమయం అందించే రెస్క్యూ సమయంలో అందించే సేవలను కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. తీరప్రాంతంలో స్పేస్ ఐఆర్ఎఫ్‌ను భద్రపరచడంతో పాటూ ప్రకృతి వైపరీత్యం, హాస్పిటల్ తదితర వాటిపై విన్యాసాలు ప్రదర్శించారు. ఇరుదేశాలకు చెందిన సుమారు 1000 మంది త్రివిధ దళాల సభ్యులు విన్యాసాల్లో పాల్గొని యుద్ధ సమయాల్లో నిర్వహించే విధులు, పోరాటాలను ప్రదర్శించారు. భారత్ భూభాగంలోకి ఉగ్రవాదుల చొరబాట్లు, భూభాగం ఆక్రమణకు ప్రయత్నిస్తున్న శత్రుదేశాలపై త్రివిధ దళాలు దాడులు చేసి, శత్రువు శిబిరాలపై ఆకాశ, జల, భూ భాగంపై నుంచి మెరుపు దాడులతో ఆట కట్టించారు. మెకనైజ్డ్ లాంగ్ ల్యాండింగ్ క్రాఫ్టులు, ల్యాండింగ్ ప్లాట్‌ఫారమ్ డాక్, ల్యాండింగ్ షిప్ ట్యాంకులు, యుద్ధ ఎయిర్‌క్రాఫ్టులు, యుద్ధ ట్యాంకర్ల విన్యాసాలు ఎంతో అబ్బురపరిచాయి.





నౌకాదళం యుద్ధ హెలికాప్టర్ నుంచి రోప్‌తో కిందకు దిగుతున్న కమాండోలు, సముద్రంలో నుంచి యుద్ధానికి ఆయుధాలతో బయటకువస్తున్న సైనికులు

ఇరుదేశాల సంబంధాలు మరింత పటిష్టం
హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్

టైగర్ ట్రంప్ పేరిట ఇండియా-అమెరికా త్రివిధ దళాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలతో ఇరుదేశాల మధ్య స్నేహ పూర్వక వాతావరణం, బంధం మరింత బలపడుతుందని హైదరాబాద్ యూఎస్ కాన్సులేట్ జనరల్ జెన్నిఫర్ లార్సెన్ పేర్కొన్నారు. యాంపీబీఎస్ విన్యాసాలను తిలకించేందుకు శుక్రవారం కాకినాడ తీరానికి ఇరుదేశాల త్రివిధ దళాల అధికారులతో కలసి వచ్చారు. ఇరుదేశాల అధికారులకు కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఘన స్వాగతం పలికారు. జెన్నిఫర్ లార్సన్ మాట్లాడుతూ ఏటా సంయుక్తంగా నిర్వహిస్తున్న సైనిక విన్యాసాలతో కొత్త పుంతలు తొక్కుతుందన్నారు. ఈ కసరత్తు వల్ల విన్యాసాల్లో ఇరుదేశాల త్రివిధ దళాలకు ఉన్న ప్రతిభ, మెళుకువలను ప్రదర్శించి మరింత పటిష్టంగా ఉండేందుకు తోడ్పడుతుందన్నారు. మా బలగాలు మునుపెన్నడూ లేనంతగా సన్నిహితంగా పని చేస్తున్నాయన్నారు. టైగర్‌ట్రంప్ వంటి వ్యాయామాలు, కసరత్తు ద్వారా యునైటెడ్ స్టేట్స్ భారత్‌ల మధ్య పరస్పర భద్రతా లక్ష్యాలను సాధించేందుకు దోహదంచేస్తుందన్నారు. బందోబస్తు ఏర్పాట్లను ఎస్‌డీపీవో దేవరాజ్ మనీష్ పాటిల్, రూరల్ సర్కిల్ సీఐ డీఎస్ చైతన్యకృష్ణ పర్యవేక్షించారు.



జెన్నిఫర్ లార్సెన్‌తో కరచాలనం చేస్తున్న కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

సీఐ, ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

యానాం, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): సీఐ ఆడాల్ రసన్, ఎస్ఐ ఇ.పునితరాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పనిచేసిన షణ్ముగం పుదుచ్చేరి ఎఫ్ఆర్ఓకు, ఎస్ఐగా పనిచేసిన మురుగానంధం పుదుచ్చేరిలోని ఆరియాకుప్పంకు వెళ్లారు. సీఐ ఆడాల్ పుదుచ్చేరి సీసీఆర్ నుంచి, ఎస్ఐ రాజ్ ఆరియాకుప్పం నుంచి వచ్చారు.

నేటి నుంచి బీచ్ వాలీబాల్ టోర్నమెంటు

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఏపీ జర్నలిస్టు స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ మెమోరియల్ జర్నలిస్టు బీచ్ వాలీబాల్ టోర్నమెంటు ఈనెల12,13తేదీల్లో ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం బీచ్‌లో నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులం ప్రసాద్, ప్రచార కార్యదర్శి తలారి నాగలింగస్వామి తెలిపారు.

బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలి


కలెక్టరేట్ ఎదుట బీఎస్పీ నాయకుల నిరసన

అమలాపురం టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): దేశ జనాభాలో 52శాతం మంది ఉన్న బీసీలకు 52శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ బహుజన సమాజ్ పార్టీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మహాత్మా జ్యోతిబాపూలే జయంతిని పురస్కరించుకుని కలెక్టరేట్ ఎదుట ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. బీసీ సమరభేరి పేరిట నిరసన ప్రదర్శన చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గెడ్డం సంపదరావు, జిల్లా ఇన్‌చార్జి కాంగ్రెగుల నరసింహం, జిల్లా ఇన్‌చార్జి కాశి లక్ష్మీభవానీలు మాట్లాడుతూ దేశ జనాభాలో అత్యధికంగా ఉన్న బీసీలను సంఘటితం చేయాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అనంతరం కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. నిరసనలో జిల్లాశాఖ అధ్యక్షుడు కుసుమ వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బూసి జాన్‌మోషే, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కోలా త్రిమూర్తులు, అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి పొలమూరి మోహన్‌బాబు, నాయకులు జేఎస్డీ రాజు, ఆకుమర్తి భూషణం, రాణి, జిత్తుక సత్యనారాయణ, వాకపల్లి హరీష్‌కుమార్, నందిక క్రాంతి పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ పదవిని శెట్టిబలిజలకు కేటాయించాలి



తాటిపాకలో నిరసన తెలుపుతున్న రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు

రాజోలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రాజోలు ఏఎంసీ చైర్మన్ పదవిని శెట్టిబలిజలకు కేటాయించాలని రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తాటిపాక సెంటర్‌లో శెట్టిబలిజ సంక్షేమ సంఘం నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. రాజోలు ఏఎంసీ చైర్మన్ పదవిని శెట్టిబలిజలకు ఇవ్వాలంటూ వారు నినాదాలు చేశారు. ఈసందర్భంగా రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు గుబ్బల బాబ్జి మాట్లాడుతూ రాజోలు నియోజకవర్గంలో 80ఏళ్ల నుంచి రాజోలు ఏఎంసీ చైర్మన్ పదవిని ఆనవాయితీగా ఏ పార్టీ అధికారం చేపట్టినా శెట్టిబలిజ కులస్తులకు కేటాయిస్తారని తెలిపారు. శెట్టిబలిజలకు ఏఎంసీ చైర్మన్ పదవిని కేటాయిస్తే సీఎం చంద్రబాబుకు రుణపడి ఉంటామన్నారు. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం కన్వీనర్ గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ టీడీపీకి కష్టపడి చేసిన వారిలో శెట్టిబలిజలు ఉన్నారని, కూటమి ప్రభుత్వం నామినేటెడ్ పదవులకు రిజర్వేషన్లు వర్తింపచేయడం ఏమిటని ప్రశ్నించారు. రాజోలు ఏఎంసీ చైర్మన్ పదవి మార్పును ఆపాలని, శెట్టిబలిజ కులస్తులకే ఇవ్వాలని సీఎం చంద్రబాబును ఆయన కోరారు. ఈనిరసన కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొనడం చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, కంచి వెంకటరమణ, బొంతు రమేష్, గుబ్బల నరేంద్రకుమార్, కాంగ్రెగుల రాము, కట్టా సూరిబాబు, పిల్లి శ్రీరామమూర్తి, చెల్లింగి శ్రీను, కడియం రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దాలి



బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.4.50 కోట్ల మెగా చెక్కును అందజేస్తున్న చైర్మన్ లంకా దినకర్, ఎంపీ హరీష్ తదితరులు

అమలాపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దాలని 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంకా దినకర్ పిలుపునిచ్చారు. సమీక్ష అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో దీర్ఘకాలిక వనరుల ద్వారా జిల్లాలోని అన్ని మండలాలకు సురక్షిత తాగునీరు అందించాలన్నారు. ఇందుకోసం అవసరమైన ఓవర్‌హెడ్ ట్యాంకులు, ఫిల్టర్‌బెడ్‌లు, పైపులైన్ల నిర్మాణాలకు చర్యలు తీసుకున్నామన్నారు. ఉపాధి హామీ కూలీల్లో 62.50శాతం మంది ఎస్సీలు ఉన్నారని, మొత్తం వేతనదారుల్లో అధిక శాతం మహిళలే ఉన్నారన్నారు. డ్వాక్రా మహిళలను లఖ్‌పతి దీదీలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో పైలెట్ ప్రాజెక్టు కింద డ్రోన్ల వినియోగంపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం డ్రోన్లపై సబ్సిడీ ఇస్తుందన్నారు. 20సూత్రాల అమలుకు జిల్లా అధికార యంత్రాంగం కృషిచేస్తూ 15శాతం వృద్ధిరేటు లక్ష్యాన్ని చేరుకునేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నట్టు వివరించారు. 169 మంది లబ్ధిదారులకు బీసీ కార్పొరేషన్ ద్వారా రూ.4.50కోట్ల విలువైన మెగా చెక్‌ను చైర్మన్ లంకా దినకర్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, జేసీ నిషాంతి, డీఆర్వో రాజకుమారి, సీపీవో వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం

యానాం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక జీఎంసీ బాలయోగి క్రీడామైదానంలో సాయ్‌స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా యానాం శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు, యానాం సబ్‌కోర్టు నాయమూర్తి రాజమోహన్, ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్, సాయ్ సెంటర్ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ జి.కిషోర్, పరిపాలనాధికారి మునిస్వామి పాల్గొన్నారు. సాయ్ కోచ్‌లు ఎస్.రాజేష్, జి.రవితేజ, భద్ర, దత్తు, నాగరాజు, పోశయ్య, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పూలే





అమలాపురం: విద్యానిధిలో అంబేద్కర్ మాస్కులు ధరించిన విద్యార్థులు, పి.గన్నవరం: ఎమ్మెల్యే గిడ్డి నివాళి, మలికిపురం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ, ఉప్పలగుప్తం: పూలేకు మంత్రి సుభాష్ నివాళి

ఘనంగా జ్యోతిరావుపూలే జయంతి

అమలాపురం టౌన్, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సమాజ చైతన్యానికి, అట్టడుగు వర్గాల అభ్యున్నతికి జీవితాంతం పోరాటం సాగించిన మహనీయుడిగా మహాత్మాజ్యోతిబాపూలే చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పేర్కొన్నారు. పూలే జయంతిని పురస్కరించుకుని అమలాపురం చిన్నపిల్లల పార్కు వద్ద పూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, నాయకులు మట్టపర్తి నాగేంద్ర, కుడుపూడి త్రినాథ్, ముంగర ప్రకాష్, దండుమేను రూపేష్, చప్పిడి శోభన్‌బాబు, సంసాని బులినాని, చీకురుమెల్లి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. ఆంధ్రా ఆటోవాలా జిల్లా శాఖ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గుత్తుల రామకృష్ణ, వాసంశెట్టి శ్రీనివాసరావు, బొలిశెట్టి శంకర్, రాయుడు ప్రసాద్, బొక్కా నాని, దోనిపాటి ఏడుకొండలు, మడికి చంద్రశేఖర్, ఎం.ఆనంద్ పాల్గొన్నారు. కాంగ్రెస్ అమలాపురం అసెంబ్లీ నియోజకవర్గ కోఆర్డినేటర్ అయితాబత్తుల సుభాషిణి ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో కేకేసీ రాష్ట్ర అధికార ప్రతినిధి వంటెద్దు బాబి ముఖ్య అతిథిగా హాజరై పూలేకు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కుడుపూడి శ్రీనివాస్, ఏలేశ్వరపు రాధాకృష్ణ, జోగి అర్జునరావు, మొల్లేటి వెంకటేశ్వరరావు, ఈతకోట సోమరాజు, అయితాబత్తుల కుమార్‌సింగ్ పాల్గొన్నారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన పూలే జయంతి వేడుకల్లో కార్యదర్శి కొమ్మూరి వెంకటాచలప్రసాద్, కోశాధికారి దొమ్మేటి సాయిబాబు, ఉపాధ్యక్షులు మోకా వెంకటసుబ్బారావు, వాసిరెడ్డి సుబ్రహ్మణ్యేశ్వరరావు, నిమ్మన వీరబాబు, పట్నాల రమణ, పలివెల శ్రీనివాస్ పాల్గొన్నారు. బండారులంక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ పెనుమాల సునీత ఆధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకల్లో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, కార్యదర్శి కోరుమిల్లి శ్రీనివాస్, బుజ్జిరాజు పాల్గొన్నారు. అమలాపురం విద్యానిధి విద్యా సంస్థల ప్రాంగణంలో చైర్మన్ ఏబీ నాయుడు, కరస్పాండెంట్ ఎ.శ్యామలా మహాలక్ష్మిలు పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. పూలే జయంతి వేడుకలను పురస్కరించుకుని వందలాది మంది విద్యార్థులు అంబేడ్కర్ మాస్కులు ధరించి పూలేజయంతి వేడుకల్లో పాల్గొన్నారు.

పూలే మహోన్నత వ్యక్తి

పి.గన్నవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీన వర్గాల అభ్యు న్నతికి పోరాడిన మహోన్నత వ్యక్తి మహాత్మా జ్యోతిరావుపూలే అని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. స్థానిక జనసేన క్యాంపు కార్యాలయంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక అక్విడెక్టు వద్ద పూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీడీపీ నియోజకవర్గ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ నామన రాంబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు, సర్పంచ్ బొండాడ నాగమణి, సంసాని పెద్దిరాజు, చొల్లంగి సత్యనారాయణమూర్తి, వాసంశెట్టి కుమార్, శేరు శ్రీనుబాబు, ఆరుమిల్లి సాయిబాబు, ఆదిమూలం సూరయ్యకాపు, యాండ్ర శ్రీనివాసరావు, గుత్తుల రామకృష్ణ, యడ్ల ఏసు, పెచ్చెట్టి ఈశ్వర్, బొరుసు సుబ్బరాజు, తాటికాయల శ్రీనివాసరావు, వివిధ గ్రామాల కూటమి నాయకులు పాల్గొన్నారు.

పూలే బాటలో నడవాలి

మలికిపురం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు కృషిచేసిన మహనీయుడు మహాత్మాజ్యోతిరావుపూలే అని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. విశ్వేశ్వరాయపురంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. అదేవిధంగా పూలే-అంబేడ్కర్ భవనం వద్ద పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, డీసీ పినిశెట్టి బుజ్జి, చాగంటి స్వామి, ముప్పర్తి నాని, మల్లిపూడి సత్తిబాబు, గుబ్బల రవికిరణ్, చెల్లింగి సత్యనారాయణ, గుబ్బల ఫణి, ఎంపీపీ ఎంపీ సత్యవాణి, పెదకాపు, సీహెచ్ హెలీన, తాతాజీ, నాని, ఫణి, గెడ్డం పేర్రాజు, గెడ్డం తులసీభాస్కర్, గుబ్బల బాబ్జి, నల్లి శివ, గెడ్డం తులసీభాస్కర్, గెడ్డం ఫిలిప్‌రాజు పాల్గొన్నారు.

పూలే అందరికీ ఆదర్శం

మామిడికుదురు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సామాజిక వేత్త మహాత్మాజ్యోతిరావు పూలే అందరికీ ఆదర్శనీయుడని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొనియాడారు. అప్పనపల్లిలో పూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. మామిడికుదురు బాలుర వసతిగృహం వద్ద గల పూలే విగ్రహానికి బీసీ, ఎస్సీ ఉద్యోగుల సంఘ సభ్యులు పూలమాలలువేసి నివాళులర్పించారు. కాంగ్రెస్ నాయకులు కూడా వసతిగృహం వద్ద పూలే విగ్రహానికి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మండలశాఖ అధ్యక్షుడు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, భైరిశెట్టి దుర్గా రామకృష్ణ, ఉద్యోగ సంఘాల నాయకులు గుబ్బల మురళీకృష్ణ, బొక్కా వీరవెంకటేశ్వరరావు, కారుపల్లి కల్యాణ్‌బాబు, నయినాలరఘురామయ్య, భూపతి మనోహర్‌రాజు, కాంగ్రెస్ నాయకులు అప్పన శ్రీరామకృష్ణ, నీతిపూడి బాలసత్యనారాయణ, బత్తుల సురేష్‌బాబు పాల్గొన్నారు.

జ్యోతిరావుపూలేకు నివాళి

ముమ్మిడివరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కులతత్వం, సామాజిక అసమానతలను రూపుమాపేందుకు, మహిళలు కూడా విద్యను అభ్యసించినప్పుడు సమాజాభివృద్ధి సాధ్యపడుతుందని పోరాటం సాగించిన మహోన్నత వ్యక్తి జ్యోతిరావుపూలే అని కారెం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ముమ్మిడివరంలోని సీపీఎం పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం నిర్వహించిన జ్యోతిరావుపూలే జయంతి కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కేవీపీఎస్ కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి మండల కమిటీ నాయకులు యలమంచిలి బాలరాజు, నిమ్మకాయల ధనలక్ష్మి, జి.దుర్గాప్రసాద్, పాము బాలయ్య, దొమ్మేటి వీరరాఘవులు, అనుచూరి లక్ష్మణరావు, నిమ్మకాయల వెంకటేష్, కాకి రాంబాబు పాల్గొని నివాళులర్పించారు. అలాగే షెడ్యూల్డు కులాలసంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. మట్టా శ్రీనివాసరావు అధ్యక్షతన ముమ్మిడివరంలోని అంబేడ్కర్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కాశి వెంకటాచార్య, జనిపల్లి బాలకృష్ణ, జనిపల్లిస త్యనారాయణ, కాశి జగ్జీవన్‌రాం, పి.డేనియల్, నక్కా శ్రీనివాస్, ఎన్.అబ్బులు, జె.భైరవస్వామి, యు.దశరథరామయ్య, ఎస్వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

సమానత్వానికి నాంది పలికిన పూలే

సమాజంలో సమానత్వానికి నాంది పలికిన మహోన్నత వ్యక్తి జ్యోతిబా పూలే అని ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్ పేర్కొన్నారు. ముమ్మిడివరం నగరపంచాయతీ పోలమ్మచెరువు గట్టున జైబుద్ధ పార్కులో బుద్ధుని విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన పూలే జయంతి కార్యక్రమంలో మోహన్‌కుమార్ పాల్గొని పూలే చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాతా రమాబాయి అంబేడ్కర్ మహిళా సంఘం అధ్యక్షురాలు పుణ్యమంతుల రజనీ, కాశి బాబూజగ్జీవన్‌రాం, బడుగు జేమ్స్‌పాల్, టీవీ చక్రవర్తి, కాశి సింహాద్రివర్య, బొజ్జా బాలకృష్ణ, దోనిపాటి ఆంజనేయులు, గోడిభాస్కరరావు, పలివెల నరేష్, పొద్దోకు నారాయణరావు పాల్గొన్నారు.

సామాజిక విప్లవ వేత్త

అంబాజీపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సామాజిక విప్లవ వేత్త మహాత్మాజ్యోతిరావుపూలే జయంతిని గ్రామాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న జ్యోతిరావుపూలే విగ్రహానికి ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీవో జీవీ సరోవరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు పూలమాలలువేసి నివాళులర్పించారు. దాసరి సత్యనారాయణ, శిరిగినీడి వెంకటేశ్వరరావు, మైపాల తాతాజీ, కొర్లపాటి గోపి, దంతులూరి శ్రీనురాజు, గుడాల ఫణి, అరిగెల బలరామమూర్తి, దొమ్మేటి సాయికృష్ణ, శ్యామ్, వక్కలంక కల్యాణ్, పబ్బినీడి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పీడిత వర్గాల ఆశాజ్యోతి

రాజోలు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పీడిత వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావుపూలే అని దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ అన్నారు. రాజోలులో పూలే జయంతిని శుక్రవారం చిలకపాటి శ్రీధర్ అధ్యక్షతన నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలువేసి ఘన నివాళులర్పించారు. వైఎస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు, మట్టా సురేష్, జిల్లెల్ల వినోద్, లిఖితపూడి బుజ్జి పాల్గొన్నారు. తాటిపాక సెంటర్‌లో రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం పూలే విగ్రహానికి నివాళులర్పించారు. రాజోలు తాలూకా శెట్టిబలిజ సంక్షేమసంఘం అధ్యక్షుడు దొమ్మేటి ఉమామహేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు గుబ్బల బాబ్జి, కన్వీనర్, గుబ్బల శ్రీనివాస్ మాట్లాడుతూ పూలే ఆశయాలను ప్రతీ ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాల న్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడలి సత్యనారాయణ, కాంగ్రెగుల సత్యనారాయణమూర్తి, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీరామమూర్తి, కాంగ్రెగుల స్వామి, కట్టా సూరిబాబు, కాంగ్రెగుల కృష్ణ, గుబ్బల నరేంద్రకుమార్, కాంగ్రెగుల రాము, కడలి నారాయణమూర్తి పాల్గొన్నారు.

పూలేకు మంత్రి సుభాష్ నివాళి

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తంలో మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తొలుత ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గుత్తుల నాగేశ్వరరావు, కూటమి నాయకులు దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ, అరిగెల నానాజీ, నిమ్మకాయల సూర్యనారాయణమూర్తి, కంకటాల రామం, చప్పిడి వెంకటనాగేశ్వరరావు, కడలి శ్రీనివాసరావు, చప్పిడి వెంకటేశ్వరరావు(కిరణ్), రవణం మధు, చిక్కం పెద్దబ్బులు, చీకట్ల ఏసు, శీలం భాస్కరరావు, మంచెం బాబి, సర్పంచ్ కడిమి చిన్నవరాజు పాల్గొన్నారు. కాగా భీమనపల్లి శ్రీమతి శిరంగు రంగనాయకమ్మ జడ్పీ హైస్కూల్లో హెచ్‌ఎం నూకల సత్యనారాయణ అధ్యక్షతన పూలే జయంతిని జరుపుకున్నారు.

జ్యోతిరావు పూలే జయంతి

కాట్రేనికోన, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అయితాబత్తుల పండుబాబు ఆధ్వర్యంలో కాట్రేనికోన గేట్ సెంటర్‌లో జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు పాలెపు ధర్మారావు, సంగాని నాగరాజు, అర్థాని నాగరాజు, మల్లాడి గోపి, కముజు రాంబాబు, కాశి సురేష్, నేలపాటి సురేష్, గజినీ, రాముడు పాల్గొన్నారు.

పూలే సేవలు ఆదర్శనీయం

అల్లవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే సేవలు ఆదర్శనీయమని క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు అన్నారు. అల్లవరం హైస్కూలు సెంటర్‌లో పూలే విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. టీడీపీ ఎస్సీసెల్ నాయకుడు పచ్చిమాల ఏడుకొండలు, బొక్కా నాగశివప్రసాద్, కడలి కాళిదాసు, యల్లమిల్లి రమణ, కొపనాతి తాతాజీ పాల్గొన్నారు. అల్లవరం మండలపరిషత్‌లో పూలే చిత్రపటానికి ఎంపీపీ యిళ్ల శేషగిరిరావు, ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్‌లు నివాళులర్పించారు. ఏవో బి.లక్ష్మణరావు, డిప్యూటీ ఎంపీడీవో యు.నాగేంద్ర పాల్గొన్నారు.

కూటమి నాయకుల నివాళి

అంతర్వేది, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో జ్యోతిరావుపూలే జయంతి సందర్భంగా జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. గెడ్డం మహాలక్ష్మిప్రసాద్, గెడ్డం పేర్రాజు, గుబ్బల ఫణికుమార్, రావూరి నాగు, పొన్నాల విజయ్, ఉండపల్లి అంజి, భైరా నాగరాజు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

మోటార్‌సైకిల్ ఢీ.. వ్యక్తి మృతి

ముమ్మిడివరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): నడిచిన వెళుతున్న ఓ వ్యక్తిని మోటారుసైకిలిస్టు ఢీకొట్టిన సంఘటనలో మృతిచెందాడు. కొమానపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తకాల్వకు చెందిన శీలం నాగేశ్వరరావు (54) గురువారం సాయంత్రం కూలీ పనులకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా యానాం వైపు నుంచి వస్తున్న మోటారు సైకిలిస్టు ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన నాగేశ్వరరావును అంబులెన్సులో అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ వైద్య సేవలు అందించిన తరువాత ఇంటికి తీసుకువచ్చారు. శుక్రవారం ప్రైవేటు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అతడికి భార్య పద్మ, కుమారుడు ఉన్నారు. నాగేశ్వరరావు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎస్ఐ డి.జ్వాలాసాగర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మామిడికుదురు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతిచెందాడు. మానేపల్లికి చెందిన కోన వెంకట్రావు(70) సైకిల్‌పై నగరం గ్రామంలో ఓఎన్జీసీ రిఫైనరీ గేటుఎదుట రోడ్డు దాటుతుండగా సైకిల్‌ను లారీ ఢీకొట్టింది. లారీ వెనుకచక్రం కింద అతడు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. నగరం ఎస్ఐ ఎ.చైతన్యకుమార్ కేసుదర్యాప్తు చేస్తున్నారు.

త్రుటిలో తప్పిన పెనుప్రమాదం..

జగ్గన్నపేట నుంచి కడలి వెళ్లే రోడ్డులో మొగలికుదురు పంచాయతీ పరిధిలో శుక్రవారం పెనుప్రమాదం త్రుటిలో తప్పింది. కాకినాడ నుంచి వెళుతున్న కారు రోడ్డుపక్కనే ఉన్న పంటకాల్వ పాంచాలను ఢీకొట్టి దానిపక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ స్తంభం విరిగిపోయింది. స్తంభానికి ఉన్న సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ దూరంగా పడిపోయింది. ఆ సమయంలో సమీపంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు పేర్కొంటున్నారు. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరూ సురక్షితంగా బయటపడ్డారు.

చికిత్స పొందుతూ అంగన్‌వాడీ టీచరు మృతి

అల్లవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఇంటి నిర్మాణంలో ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురైన తాటికోన అంగన్‌వాడీ టీచర్ గెడ్డం మణికుమార్ ఆత్మహత్యకు పాల్పడి చికిత్స పొందుతూ మృతిచెందింది. తాడికోన గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్ గెడ్డం మణికుమారి(45) ఇంటి నిర్మాణంలో ఆర్థిక ఇబ్బందులు, అప్పుల బాధ తాళలేక మార్చి 23వ తేదీన బాత్రూమ్ క్లీనింగ్‌కు ఉపయోగించే హార్పిక్‌లో గడ్డి మందు కలుపుకుని తాగింది. 20రోజులుగా అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మరణించిందని ఎస్ఐ టి.తిరుమలరావు తెలిపారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

పంచాయతీ కార్యాలయంలో కూర్చుని వెళ్లిన దినకర్

ఉప్పలగుప్తం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఇరవై సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంక దినకర్ శుక్రవారం భీమనపల్లి పంచాయతీ కార్యాలయానికి వచ్చి సిబ్బంది లేకపోవడంతో తిరిగి వెళ్లిపోయారు. ఆయన భీమనపల్లి పంచాయతీ కార్యాలయానికి మధ్యాహ్నం 3.30గంటలకు వస్తున్నట్టు కార్యదర్శికి సమాచారం అందించినట్టు బీజేపీ నాయకుడు చెప్పారు. అయితే దినకర్ ఆలస్యంగా రావడంతో అప్పటికే కార్యదర్శి వెళ్లిపోయారు. దీంతో దినకర్ కొద్దిసేపు సర్పంచ్ గదిలో కూర్చుని వెనుదిరిగారు.

ఆలయ నిర్మాణానికి అనుమతులు ఇవ్వండి

అంబాజీపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): వక్కలంక గ్రామం గ్రామకంఠం స్థలంలో 30ఏళ్లుగా ఉన్న అమ్మవారి ఆలయ స్థానంలో నూతనంగా ఆలయాన్ని నిర్మించేందుకు అనుమతులు ఇవ్వాలని గ్రామస్తులు అధికారులకు వినతిపత్రాన్ని అందించారు. వక్కలంక పంచాయతీ పరిధి చెరువుగట్టు వద్ద 30ఏళ్ల క్రితం తాత్కాలికంగా కనకదుర్గమ్మ ఆలయాన్ని నిర్మించామన్నారు. ఆ ఆలయ స్థానంలో నూతన ఆలయ నిర్మాణ పనులు చేస్తుండగా రజక కులస్తులు అడ్డుకున్నారని అధికారులకు వివరించారు. మండల రెవెన్యూ, పంచాయతీ అధికారులు స్థలాన్ని పరిశీలించి పంచాయతీ స్థలంగా గుర్తించారన్నారు. భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని ఆలయ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కలెక్టర్, ఎంపీడీవో, తహశీల్దారు, పంచాయతీ అధికారులకు వినతిపత్రాలు అందించారు.

మండల కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా రాజమోహన్

అల్లవరం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): అల్లవరం పంచాయతీ కార్యదర్శుల సంఘం మండల అధ్యక్షుడిగా ఎస్.రాజమోహన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా చిక్కం శ్రీనివాస్, పెచ్చెట్టి సత్యనారాయణ, కార్యదర్శిగా ఆదిశంకరం, కోశాధికారిగా శంకరప్రసాద్, సంయుక్త కార్యదర్శిగా మానే కనకమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన సంఘ నాయకులను ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ అభినందించారు.

సంస్కారభారతి జిల్లా శాఖ నూతన కార్యవర్గం

అమలాపురం రూరల్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): సంస్కారభారతి జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఈదరపల్లిలోని జనహిత భవన్‌లో ఆకొండి పవన్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రకటించారు. తొలుత జిల్లా ప్రధాన కార్యదర్శి పుత్సా కృష్ణకామేశ్వర్ మూడేళ్ల కాలంలో నిర్వహించిన కార్యక్రమాలపై త్రైవార్షిక నివేదికను సభ ముందు ఉంచారు. అనంతరం సంస్కారభారతి ప్రాంత ఉపాధ్యక్షురాలు వేదనభట్ల సాయిలక్ష్మి నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. సంస్కారభారతి అధ్యక్షురాలిగా శ్రీగిరి పద్మావతి, కార్యదర్శిగా వలవల వెంకటరెడ్డినాయుడు, కోశాధికారిగా ఈవని సాయికృష్ణ, ఉపాధ్యక్షుడిగా కూచిమంచి కృష్ణ, సహకార్యదర్శులుగా గోటేటి గంగాధరరావు, బూరగాయల శివరామకృష్ణలను ప్రకటించి వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, భమిడపాటి సుగుణ, పెన్షనర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు సాయివరప్రసాద్, కేకేవీ నాయుడు, జయంతి శర్మ, గోకరకొండ నాగేంద్ర, బోనం సత్యవరప్రసాద్, బులుసు జగదీష్, పేరి లక్ష్మీనరసింహం, బోనం సత్యవరప్రసాద్, లక్ష్మీశైలజ తదితరులు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులను సత్కరించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

అయినవిల్లి, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి):ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం నేదునూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రైతులు ధాన్యం అమ్మిన 48గంటల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చిట్టూరి శ్రీనివాస్, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మద్దాల సుబ్బారావు, డ్రిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ కాకర శ్రీనివాస్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ సయ్యపరాజు సత్యనారాయణరాజు, మోత వెంకటేశ్వరరావు, కళ్లేపల్లి సుబ్బరాజు, రైతులు పాల్గొన్నారు.

పాఠశాలలు తెరిచే నాటికి విద్యా కిట్లు పంపిణీ చేయాలి

ముమ్మిడివరం, ఏప్రిల్ 10 (ఆంధ్రజ్యోతి): రానున్న విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలు తెరిచే నాటికి సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లను పాఠశాలలకు పంపిణీ పూర్తి చేయాలని జిల్లా పరిశీలనాధికారి అబ్దుల్‌గనీ సూచించారు. మండలంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్లను కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి బి.సుబ్రహ్మణ్యంతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. సప్లయి చేయబడిని నోటు, టెక్స్ట్ బుక్స్, బ్యాగులు, షూలు, ఏకరూపు దుస్తులను ఆయన పరిశీలించారు. మండల విద్యాశాఖాధికారి-2 ఆర్.ఉదయభాస్కరరావు, పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ పరిమళ, మండల బృందం పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

మలికిపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): 20సూత్రాల కమిటీ చైర్మన్ లంక దినకరణ్ దిండి విచ్చేశారు. ఈసందర్భంగా బీజేపీ నాయకులు దినకరణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో అభినందించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో బీజేపీ నాయకులు విశేష కృషి చేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ, జిల్లా బీజేపీ అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్, యేడిద వంశీ తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువ చానల్‌ను బాగుచేస్తాం

మలికిపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): మొండికోడు చానల్‌ను మరమ్మతులుచేసి రైతులకు మేలుచేకూరే విధంగా చర్యలు తీసుకుంటామని ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. మలికిపురం వేంకటేశ్వరస్వామి గుడి వద్ద నుంచి వియ్యారువారిమెరక, మోరి మీదుగా వెళుతున్న ఈకాల్వను అభివృద్ధి చేస్తామన్నారు. ఆయన వెంట ముప్పర్తి నాని, పిండి సత్యనారాయణ, చాగంటి స్వామి, అడబాల యుగంధర్ ఉన్నారు.

ఎల్ఎంఎల్‌హెచ్‌పీల సమస్యలు పరిష్కరించాలి

మామిడికుదురు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కరించాలంటూ పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణకు వైద్య ఆరోగ్యశాఖ నేషనల్ హెల్త్ మిషన్ ద్వారా ప్రజారోగ్య వ్యవస్థలో పనిచేస్తోన్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (ఎంఎల్‌హెచ్‌పీల) వినతిపత్రాన్ని శుక్రవారం అందించారు. ఆరేళ్లుగా ఉద్యోగ, ఆర్థిక భద్రత లేకుండా పోయిందని, ఏడు నెలలుగా జీతాలు బకాయిలు పెట్టారని, తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా వేతనం చెల్లించాలని, ఎఫ్ఆర్ఎస్ నుంచి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండలానికి చెందిన ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

విద్యా కిట్లు పంపిణీకి ప్రణాళిక

మామిడికుదురు, ఏప్రిల్11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు విద్యా కిట్లను అందించేందుకు ప్రణాళిక రూపొందించామని సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థిమిత్ర కిట్లరాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ గనీ అన్నారు. శుక్రవారం లూటుకుర్రు జడ్పీ ఉన్నతపాఠశాలలో గల విద్యాకిట్ల గోదామును ఆయన సందర్శించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు గాడేపల్లి నాగప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల పరిధిలో 3,373మందికి విద్యా కిట్లు అందించడానికి కార్యాచరణ చేసినట్టు సమగ్ర శిక్ష జిల్లా సీఎంవో సుబ్రహ్మణ్యం తెలిపారు. ఎంఈవోలు మోకా వెంకన్నబాబు, ఎస్ఎంసీచైర్మన్ బోనం సత్తిరాజు పాల్గొన్నారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

వెదురుపాక పంచాయతీ వద్ద చలివేంద్రం



వెదురుపాక పంచాయతీ వద్ద చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ సూరారెడ్డి

రాయవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : వెదురుపాక గ్రామ పంచాయతీ వద్ద శుక్రవారం సర్పంచ్ మల్లిడి సూరారెడ్డి చేతుల మీదుగా చలివేంద్రాన్ని ప్రారంభించారు. వేసవి దృష్ట్యా గ్రామస్థులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు దీన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన తెలిపారు. ఈసందర్భంగా సర్పంచ్ చేతులమీదుగా ప్రజలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొవ్వూరి చంటిరెడ్డి, కొవ్వూరి నాగిరెడ్డి, కిషోర్, బీజేపీ నాయకురాలు కె.శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి జీవీ రమణ, జనసేన నాయకులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అకాల వర్షం.. అన్నదాతకు నష్టం



యండగండిలో వర్షానికి తడిసిపోయిన ధాన్యం రాశులు

కె.గంగవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. మండలంలో సుమారు 16 వేల ఎకరాల్లో వరి సాగవుతోంది. ఈ దశలో ఈదురు గాలులతో కూడిన వర్షం కురవడంతో పంట పూర్తిగా నేలమట్టమయ్యింది. ఇప్పటికే వరి కోతలు కోసి ఆరబెడు తున్న ధాన్యం రాశులు తడిసిపోయాయి. రైతులు నానా అవస్థలు పడుతున్నారు.

ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు

రాయవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): లొల్ల విశ్వమానవతా ఆశ్రమంలో విద్యార్థులకు ఉచిత పాలిటెక్నిక్ శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాస చౌదరి తెలిపారు. శుక్రవారం లొల్లలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా నిర్వహించే సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు వేసవిలో సమయం వృథా కాకుండా ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈనెల 12 నుంచి మూడు విడతలుగా శిక్షణ ఉంటుందన్నారు. వీటితో పాటు యోగా, ఆరోగ్యం, వ్యక్తిత్వ వికాసం, జీవన నైపుణ్యాలు, హస్తకళలు, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో భాగంగా భగవద్గీత, క్రీడలపై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్టు చెప్పారు. వివరాల కోసం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. మానవతా. ఓఆర్‌జీని సంప్రదించాలని లేదా 99666 73283 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

వినాయకుడి ఆలయంలో పూజలు



లొల్ల వరసిద్ధి వినాయక ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రాయవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): లొల్ల శ్రీవరసిద్ధి వినాయకుడి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం లక్ష గరిక పూజ, హోమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు యలమంచిలి సత్యనారాయణశర్మ, యలమంచిలి విశ్వనాథం, యలమంచిలి సుబ్బారావు పర్యవేక్షణలో వినాయక పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, 11 రకాల ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం, హోమం, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు జరిపి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహించారు. లొల్ల, రాయవరం, సోమేశ్వరం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.



మండపేట: పూలే విగ్రహానికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, తదితరులు



కే.గంగవరం : పూలే చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీపీ నాగమణి



కపిలేశ్వరపురంలో ...

పూలే అడుగుజాడల్లో నడుచుకోవాలి

● జయంతి కార్యక్రమాల్లో నేతల పిలుపు

మండపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): మహాత్మాజ్యోతిరావు పూలే దేశంలో కుల నిర్మూలన కోసం పోరాడిన మహా సంఘసంస్కర్త అని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని పెద్దకాల్వ వంతెన వద్ద గల ఆయన విగ్రహానికి కూటమినేతలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కోనా సత్యనారాయణ, బీసీసంఘాల నాయకులు, వివిధ పార్టీలకు చెందిన నేతల ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, కాశిన కాశీ విశ్వనాథం, జె.సూర్యారావు, పిట్లా రాజబాబు, నెల్లిపూడి సత్యనారాయణ, బండి గోవిందు, తదితరులు పాల్గొన్నారు. పట్టణ బీసీ సంఘం అధ్యక్షుడు ఎం.గణపతిరావు సారథ్యంలో బీసీ సంఘ నాయకులు శుక్రవారం పెద్దకాల్వ వద్ద వున్న మహాత్మాజ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

కె.గంగవరం: మహాత్మాజ్యోతిరావు పూలే నేటి సమాజానికి ఆదర్శనీయుడని ఎంపీపీ పంపన నాగమణి అన్నారు. శుక్రవారం పూలే జయంతిని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్ర మంలో పంపన సుబ్బారావు, ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ సురేంద్ర రెడ్డి, మోహన్, సత్యనారాయణ, ఎన్ఆర్‌జీఎస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: మహనీయుడు మహాత్మా జ్యోతిరావ్ పూలే అని పలువురు వక్తలు కొనియాడారు. శుక్రవారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. నిర్వాహక కమిటీ కన్వీనర్ జుత్తుగ మల్లిఖార్జునుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్, ఉపసర్పంచ్ బొక్కా రాంబాబు, ఎంపీటీసీలు శీలం భాస్కరరావు, గొల్లపల్లి సోనియా, బీసీ సంఘం నాయకులు కాద రాంబాబు, పితాని రామచంద్రరావు, కొప్పిశెట్టి వాసు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం చదువులో ప్రతిభాపాటవాలను కనబర్చి నవోదయ 2025కు ఎంపికైన అంగర శ్రీ రామకృష్ణా పబ్లిక్ స్కూల్ 6వ తరగతి విద్యార్థి చిట్టిమేను గౌతమ్ సాయి సాత్విక్‌ను బీసీ సంక్షేమం సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామసర్పంచ్ సాకా శ్రీనివాస్ ఆధ్వర్యంలో, మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో రత్నకుమారి ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. తహశీల్దార్ చిన్నారావు, మండల పరిషత్ ఏవో రాజేంద్రప్రసాద్, నాయకులు మేకా ప్రసాద్, పువ్వల చిట్టిబాబు, నెక్కంటి శ్రీరాంజీ, పర్వతిన మురళీకృష్ణ, నూపే అబ్బిరాజు, మల్లిపూడి శివకుమార్, పిప్పర సంపతరావు, కట్టా మురళి, కుడుపూడి సురేష్, జుత్తుగ రాంప్రసాద్, వీఆర్‌వోలు, ఆయా కార్యాలయాల సిబ్బంది, అధిక సంఖ్యలో బీసీ సంఘ నాయకులు, వివిధ సంఘాల నాయకులు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు ఫలించిన పోరాటం

● మద్యం దుకాణం ఏర్పాటు స్థలం మార్పు
● మూడు వార్డుల ప్రజలకు ఊరట



మండపేటలో వార్డు ప్రజలు, అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సత్యశ్రీరోడ్డు సప్తగిరి థియేటర్ ఎదురుగా కల్లుగీత కార్మికుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన మద్యం దుకాణాన్ని జనావాసాల మధ్య ఏర్పాటు చేయడాన్ని నిరసిస్తూ మూడు వార్డులకు చెందిన మహిళలు చేసిన రిలే నిరాహార దీక్షలు ఎట్టకేలకు ఫలించాయి. గత 23 రోజులుగా దీక్ష చేస్తున్న విషయం తెలిసిందే. దీంతో వారంతా కలెక్టర్, జేసీ, స్థానిక అధికార, ప్రతిపక్ష నేతలకు తమగోడును విన్నవించుకున్నారు. అయితే ఎట్టకేలకు ఎమ్మెల్యే వేగుళ్ల చొరవతో శుక్రవారం సమస్య పరిష్కారమైంది. దీక్షలో వున్న 28,29,30 వార్డులకు చెందిన మహిళలతో ఆయన మాట్లాడారు. సమస్యను పరిష్కరించిన వేగుళ్లకు వారంతా ధన్యవాదాలు తెలిపారు. మండపేట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, బండి గోవిందు, పట్టణ సీఐ సురేష్, ఆలమూరు ఎక్సైజ్ సీఐ నాగేశ్వరరావు, తదితరులు వున్నారు.

నేడు రిజిస్ట్రేషన్లకు అవకాశం

అమలాపురం టౌన్, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి) : రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖ ఆదేశాలను అనుసరించి ఈనెల 12వ తేదీ (రెండో శనివారం) రిజిస్ట్రేషన్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చినట్టు జిల్లా రిజిస్ట్రార్ సీహెచ్ నాగలింగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

రుణాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు చెక్కులను అందిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

మండపేట, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అందించే ఆర్థిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు లబ్ధిదారులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం ప్రధానమంత్రి అనుసుచిత్ జాతీయ అభ్యుదయ యోజన పథకం ద్వారా వివిధ వ్యాపారాలు చేసుకునేందుకు ఐదుగురు ఎస్సీ మహిళలకు మంజురైన రూ. ఐదు లక్షలను వేగుళ్ల చేతులమీదుగా శుక్రవారం అందించారు. కార్యక్రమంలో స్థానిక నేతలు దేవువెంకట్రాజు, దార్ల సుధీర్, ఎం. పండు, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తెరిచేనాటికే విద్యార్థులకు విద్యా కిట్లు



పామర్రులో స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న ఏఎంవో

కె.గంగవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): రానున్న 2025-26 విద్యాసంవత్సరం పాఠశాలలు తెరిచే సమయానికే సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకంలో విద్యార్థులకు కిట్‌లు అందజేయడం జరుగుతుందని సర్వశిక్ష ఏఎంవో పిల్లి రాంబాబు, ఎంఈవో ఏ. నాగరాజులు అన్నారు. శుక్రవారం వారు పామర్రు ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న స్టాక్ పాయింట్ రూమ్‌లు పరిశీలించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ జుత్తుగ వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి పూజలు

రాయవరం, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): వెదురుపాక విజయదుర్గా పీఠంలో శనివారం చైత్ర పౌర్ణమి పూజలు నిర్వహించనున్నట్టు పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు తెలిపారు. శుక్రవారం ఆయన రాయవరంలో మాట్లాడుతూ పౌర్ణమిని పురస్కంచుకుని అమ్మవారికి వివిధరకాల ద్రవ్యాలతో అభిషేకాలు, భవానీ శంకర అష్టలింగేశ్వరస్వామికి ఏకవార రుద్రాభిషేకం, విజయ వేంకటేశ్వరస్వామికి తులసీదళార్చన నిర్వహిస్తామన్నారు.



కొత్తపేటలో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బండారు



ఆలమూరులో పూలే చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న నాయకులు



ద్రాక్షారామలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

సంఘ సంస్కర్త పూలే

» కొత్తపేట ఎమ్మెల్యే బండారు
» ఘనంగా జ్యోతిరావ్ పూలే జయంతి
» పలువురు నాయకుల నివాళి

కొత్తపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): బలహీన వర్గాల ఆశాజ్యోతి, సంఘ సంస్కర్త, సామాజిక తత్వవేత్త మహాత్మా జ్యోతిరావు పూలే స్త్రీల అభ్యున్నతికి, కులవివక్షతకు వ్యతిరేకంగా పోరాడిన మహోన్నతుడని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని శుక్రవారం పలు చోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తపేట పంచాయతీ ఆవరణలో ఉన్న పూలే విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడారు. అలాగే బీజేపీ మండలాధ్యక్షుడు సంపతి కనకేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం పాల్గొని పూలేకు నివాళులర్పించారు. కొత్తపేట వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ కేవీ రాజు అధ్యక్షతన పూలే జయంతి నిర్వహించారు. స్థానిక విద్యా బాల మందిర్ పాఠశాలలో కరస్పాండెంట్ ఆర్.అనురాధ ఆధ్వర్యంలో పూలేకు నివాళులర్పించారు. కార్యక్రమాల్లో కంఠంశెట్టి శ్రీనివాస్, బూసి జయలక్ష్మి, విశ్వ మారుతీప్రసాద్, మిద్దే ఆదినారాయణ, బూసి భాస్కరరావు, కముజు వెంకటేశ్వరరావు, దేవపాటి వెంకటేశ్వరరావు,తమ్మన సాయి ప్రసాద్, బూసి విష్ణుమూర్తి, దూనబోయిన నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

ఆత్రేయపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి ఎంపీడీవో రామన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వసంతవాడలో బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో పూలే జయంతి నిర్వహించి స్థానికులకు ఈయన చరిత్రను వివరించారు. కార్యక్రమంలో మాగాపు ప్రభాకర్, సాకా రాజారావు, నక్కా ఐసయ్య పాల్గొన్నారు.

ఆలమూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, ఎంపీడీవో ఎ.రాజుల అధ్వర్యంలో జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సామాజిక న్యాయ పితామహుడిగా బడుగుబలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచారని పలువురు వక్తలు అన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే మండలంలోని సంధిపూడి, జొన్నాడ తదితర గ్రామాలలో పూలే జయంతి వేడుకలు నిర్వహించి స్వీట్స్ పంపిణీ చేశారు.

ద్రాక్షారామ: ద్రాక్షారామలోని మసీదు సెంటర్‌లో జ్యోతిరావు పూలే జయంతి ఘనంగా జరిగింది. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, మేడిశెట్టి సూర్యనారాయణ, సర్పంచ్ కొత్తపల్లి అరుణ.. పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో విత్తనాల వెంకట రమణ, పెంకె సాంబశివరావు, డాక్టర్ ఎం.రాంబాబు, మేడిశెట్టి వీరభద్రరావు, కొసనా శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే బీసీ సేన నాయకుడు యాట్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పూలే జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని డిమాండు చేశారు. అలాగే ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకుడు నూకల బలరాం, ఏఐకేఎంఎస్ నాయకుడు వెంటపల్లి భీమశంకరం, పీడీఎస్‌యూ నాయకుడు బి.సిద్ధూ, బీఎస్పీ నాయకుడు కొల్లపు కామేశ్వరరావు, యాట్ల నాగేశ్వరరావు తదితరులు పూలే విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో వేమవరపు రాంబాబు, గారోజు సూరిబాబు, బిల్లకుర్తి స్వామి, మేడిశెట్టి శ్రీనివాస్, షెక్‌గులాబ్, కొత్తగళ్ల భీమశంకర శివరాం పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట శ్రీనివాసరావు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

రామచంద్రపురం(ద్రాక్షారామ): స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహానికి చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వుండవిల్లి గోపాలరావు, ఏజీపీ లకాని పద్మకమల కుమారి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ నాయకుడు వాసంశెట్టి సత్యం పూలమాలలే వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు కడియాల రాఘవన్, కట్టా నాగేశ్వరరావు, న్యాయవాది మాగాపు అమ్మిరాజు, రవ్వాభూషణం, కొసనా శ్రీనివాసరావు, పంపన శ్రీనివాస్ పాల్గొన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద పూలే జయంతి నిర్వహించారు. వైసీపీ కార్యాలయం వద్ద పూలే చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌చార్జి పిల్లి సూర్యప్రకాశరావు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రావులపాలెం: రావులపాలెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో వైస్‌ప్రిన్సిపాల్ యు.రమేష్‌బాబు అధ్యక్షతన జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పూలే జీవిత విశేషాలను వివరించారు.



రామచంద్రపురంలో పూలే విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



వసంతవాడలో పూలే జీవిత చరిత్రను వివరిస్తున్న దృశ్యం



రావులపాలెంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం

ఆలమూరు, ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): ఆలమూరు మెయిన్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో శుక్రవారం ఆలయ ప్రథమ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామి వారికి ఉదయం గణపతి పూజ, అష్టోత్తర శతకలశాభిషేకం అనంతరం లక్ష్మీగణపతి హోమం, శిఖరాభిషేకం, పూర్ణాహుతి కార్యక్రమాలు వైదపండితులు రాళ్లపల్లి సూర్యసుబ్రహ్మణ్యశర్మ, నాగభట్ల సాయికృష్ణశర్మల అధ్వర్యంలో పండితులు శాస్త్రోక్తంగా జరిపించారు. గణపతి హోమంలో పలువురు దంపతులు పాల్గొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ ప్రథమవార్షికోత్సవం సందర్భంగా ఏకాహం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యవిచ్చేసి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు.

పిల్లలను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించండి

ఆలమూరు, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): నాణ్యత ప్రమాణాలు, క్వాలిఫైడ్ టీచర్లతో కూడిన ఫీజులు లేని విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో చిన్నారులను చేర్పించాలని కోరుతూ ఆలమూరు మండలంలో ఉపాధ్యాయులు జోరుగా మొదలు పెట్టారు. యూటీఎఫ్ అధ్వర్యంలో ముద్రించి కరపత్రాలను శుక్రవారం ఎంపీడీవో ఎ.రాజు, ఎంఈవోలు బి.అప్పాజీ, సుబ్బరాజుతోపాటు పలువురు ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. ఒత్తిడి లేని నాణ్యమైన విద్య, 1నుంచి ఇంగ్లీషు మీడియంలో బోధన, ప్రయోగాల ద్వారా బోధన, క్వాలిఫైడ్ టీచర్లు, నిరంతర సమగ్ర మూల్యాంకనం, విద్యార్థి సమగ్ర వికాసంపై వ్యక్తిగత శ్రద్ధ, శారీరక మానసిక వికాసం కోసం సుశిక్షితులైన వ్యాయామోపాధ్యాయులతో శిక్షణ జరుగుతుందని విరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వకార్డుల పంపిణీ



సభ్యత్వ కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు

రావులపాలెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రావులపాలెంలోని టీడీపీ క్యాంపు కార్యాలయంలో పార్టీ సభ్యత్వ కార్డులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో సభ్యత్వం పొందిన వారికి బూత్‌ల వారీగా కార్డులను అందజేస్తున్నామన్నారు. క్లస్టర్, బూత్ కన్వీనర్లు సభ్యత్వం కార్డులను పంపిణీ త్వరగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, చిలువూరి సతీష్‌రాజు, మండలాధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు తదితరులు పాల్గొన్నారు.

రబీలో ఎకరాకు 47 బస్తాల వరి దిగుబడి

ద్రాక్షారామ, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో రామచంద్రపురం మండలం యనమదల గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వరి పంట కోత ప్రయోగాల్లో ఎకరాకు 47 బస్తాల దిగుబడి వచ్చిందని మండల వ్యవసాయాధికారి సత్యప్రసాద్ తెలిపారు. పంట కోత ప్రయోగంలో 25 చదరపు మీటర్ల వైశాల్యంలో పంటను కోసి పనలను కొట్టి మాసూలు చేయగా ప్రయోగం నిర్వహించగా సదరు వైశాల్యంలో 21.850 కిలోల దిగుబడి వచ్చింది. ఈ నేపథ్యంలో ఎకరాకు 47 బస్తాలు దిగుబడి వచ్చినట్టు తేలిందన్నారు. పంట కోత ప్రయోగం రైతు పంపన సత్యనారాయణ పొలంలో జరిపామన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు కె.శ్రీదేవి, రైతులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

కొత్తపేట, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరిని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కలిసి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు రుడా నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ మేరకు ఆయనకు వినతిపత్రాన్ని అందించి చర్చించారు.

దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

ఆత్రేయపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): ఉచ్చిలి కాలువ రేవులో విజయకనకదుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహించారు. అర్చకులు అమ్మవారికి కుంకుమపూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని నైవేద్యాలు సమర్పించారు.

కేశవస్వామికి కల్యాణోత్సవ పూజలు

ఆత్రేయపురం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): పురాణ ప్రసిద్ధి గాంచిన ర్యాలి జగన్మోహిని కేశవస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా ఆరో రోజు శుక్రవారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చన, తులసీ, అమ్మవారికి కుంకుమార్చన సాయంత్రం నిత్యోపాసన, బలిహరణ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అశేష భక్తజనం స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంబగా రాత్రి బుర్రకథ కలాక్షేపం నిర్వహించారు. ఆలయ ఈవో బీహెచ్‌వీ రమణమూర్తి ఏర్పాట్లు నిర్వహించారు.

రావిచెరువులో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలి

రామచంద్రపురం(ద్రాక్షారామ), ఏప్రిల్ 11 (ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండలం రావిచెరువులో కొత్తగా పోలింగ్‌బూత్ ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీలు సూచించాయి. రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో సమావేశం నిర్వహించారు. సమావేశంలో 15 మార్చి నుంచి నేటి వరకు ఓటర్ల జాబితాపై ఫారం 6,7,8 క్లెయిములు జాబితా రాజకీయ పార్టీలకు అందజేశారు. పట్టణంలో జడ్పీ హైస్కూల్లో ఉండే పీఎస్-11 ను బ్రాడీపేట తరలించడంపై వైసీపీ ప్రతినిధులు ప్రశ్నించారు. గతంలో శీలంవారి సావరంలో ఉండే పీఎస్-25ను జూనియర్ కళాశాలకు మార్పుపైనా ప్రశ్నించారు. రావిచెరువు కు చెందిన 700మంది ఓటర్లు సత్యవాడ వస్తున్నారని రావిచెరువులో పీఎస్ ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో తహశీల్దార్ మృ త్యుంజయరావు, కాజులూరు తహశీల్దార్ పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసుపై పోలీసుల ముమ్మర దర్యాప్తు

మహారాష్ట్రకు వెళ్లిన స్థానిక పోలీసులు

రావులపాలెం, ఏప్రిల్ 11(ఆంధ్రజ్యోతి): రావులపాలేనికి చెందిన పండ్ల వ్యాపారి తిరగం మురళీధర సుబ్బారావును మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు ఈనెల 9న కిడ్నాప్ చేసిన సంగతి తెలిసిందే. మహారాష్ట్రకు చెందిన వ్యక్తులు స్థానికంగా ఉన్న మరో వ్యక్తితో కలసి సుబ్బారావును కిడ్నాప్ చేసినట్టు పోలీసులు నిర్ధారించారు. కిడ్నాప్ చేయడానికి ఎప్పుడు వచ్చారు? ఎక్కడ ఉన్నారు? ఎవరు సాయం చేశారు? అనే అంశాలపై పోలీసులు వివరాలు సేకరించి సీసీ కెమెరాలను పరిశీలించారు. సుబ్బారావు కుమార్తు రమేష్‌కు అక్కడ వ్యక్తులకు ఉన్న లావాదేవీల కారణంగానే ఈ కిడ్నాప్ చేసినట్టు తెలుస్తోంది. స్థానిక ఎస్ఐ రమణారెడ్డితోపాటు మరో ఇద్దరు కానిస్టేబుల్స్ మహారాష్ట్ర వెళ్లి కేసును దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.